AL - HILAL

# నెలవంక

మాస పత్రిక

Vol 5,Issue: 27 January - 2009

مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى

## అంధకారంలో కాంతి కిరణం

## పక్షి నేర్పే తౌహీద్ పాఠం

## చట్టం దృష్టిలో అందరూ సమానులే



ظَهَرَ ٱلْفَسَادُ فِى ٱلْبَرِّ وَٱلْبَحْرِ بِمَا كَسَبَتْ
أَيْدِى ٱلنَّاسِ لِيُذِيقَهُم بَعْضَ ٱلَّذِى عَمِلُوا۟ لَعَلَّهُمْ يَرْجِعُونَ ۝

మానవులు చేజేతులా సంపాదించుకున్న దాని ఫలితంగానే
నేలపైనా, నీటిలోనూ కల్లోలం చెలరేగింది;
వారి కొన్ని చేష్టల (ఫలితం) ను వారికి  చవి చూపటానికి;
బహుశా వారు తమను సంస్కరించుకుంటారేమో అని.

(అర్ రూమ్30: 41)



సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక


# నెలవంక


(AL-HILAL MONTHLY)

Vol 5, ISSUE: 27
JANUARY 2009



CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Muhd. Azeezur Rahman

ASSOCIATE EDITORS
Mujahid Khan Omeri
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Abdul Qadir Omeri
Sk Abdus Salam Omeri
Tahera Begum

DESIGN
Noushad Zainulabdeen



PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait



PHONES
Azeezur Rahman
22444117 EXT. 110
Mujahid Khan Omeri
24711141 EXT. 104

FAX
22400057

E-MAIL
nelavanka@ipc-kw.com

WEBSITE
www.ipc-kw.com

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT


## ఈ సంచికలో....


| | |
|---|---|
| అంధకారంలో కాంతి కిరణం | 2 |
| పక్షి ఇచ్చిన సందేశం | 3 |
| మీడియా వైఖరి మారాలి | 4 |
| జరా దేఖికె 'చలావ్' | 6 |
| పవిత్ర జీవితం | 8 |
| ధీర గుణం | 9 |
| సత్సమాజానికి షట్సూత్ర పథకం | 10 |
| చట్టం దృష్టిలో అందరూ సమానులే | 11 |
| ఇస్లాం శిక్షణ | 12 |
| సీరత్ క్విజ్ | 13 |
| మీసము లేకున్నా రోషం ఉండాలి | 14 |
| హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) | 15 |
| ఐపిసి వార్తలు | 16 |
| ఓ బాటసారీ ! నీ గమ్యం మరువకోయి | 18 |
| దేవుడు ఒక్కడు అంటేనే సరిపోతుందా | 19 |
| నెలవంక ఉత్తరాలు | 20 |





❖ كلمة العدد (لعام ٢٠٠٨م) ❖ رسالة التوحيد من لسان الهدهد ❖ الإعلام لا بد أن يكون إيجابياً
❖ أخبار كويتية (قوانين المرور) ❖ تلخيص الرحيق المختوم ❖ كيف يكون المؤمن القوي؟
❖ القواعد الأساسية للمجتمع الصالح ❖ حقوق الإنسان في الإسلام ❖ تربية المهتدين
❖ أسئلة من السيرة ❖ شبهات حول الإسلام ❖ سيرة السيدة فاطمة بنت محمد صلى الله عليه وسلم
❖ أنشطة اللجنة ❖ لا تنسي مبلغك . . . ❖ التوحيد في الكتب الهندوسية ❖ رسائل القراء



# అంధకారంలో కాంతి కిరణం

2008 సంచలనాల సంవత్సరంగా చరిత్ర పుటల్లో నిలిచి పోతుంది. అది ఎన్నో చేదు అనుభవాలను మిగిల్చింది. ఎన్నో అనూహ్య పరిణామాలకు నెలవు అయింది. మరెన్నో కొంగ్రొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టింది. నవతరానికి ఎన్నో సవాళ్ళు విసిరి వెళ్ళింది. శ్రీహరి కోట నుంచి చంద్రమండలానికి దూసుకుపోయిన 'చంద్రయాన్' భారత వైజ్ఞానిక కీర్తికి కలికితురాయిగా ఉండిపోయింది. ఈ అభివృద్ధిని జీర్ణించుకోలేని దుష్టశక్తులు వాణిజ్యనగరమైన ముంబైలో సృష్టించిన రాక్షస కాండకు మానవత విలవిల్లాడింది. అయితే సహిష్ణుతా ప్రేమికులైన భారతీయులంతా నిగ్రహంతో ఏకత్రాటిపై నడిచి, భారతదేశం యావత్ప్రపంచానికే మార్గదర్శకత్వం వహించగల ప్రజాస్వామిక దేశమని మరోసారి రుజువు చేసుకున్నారు.

ఈ ఏడు మనందరినీ ఉక్కిరిబిక్కిరి చేసిన ఘటనలలో ఒకటి ప్రపంచ వ్యాప్త ఆర్థిక సంక్షోభం. పెట్టుబడిదారీ విధానానికి మూలమంత్రమైన 'స్వేచ్ఛా విపణి' సృష్టించిన వైపరీత్యాలకు ప్రపంచమంతా నిలువెల్లా కంపించింది. ఒక్కసారిగా ధరలకు రెక్కలొచ్చేశాయి. ద్రవ్యోల్బణ రక్కసి తాండవమాడింది. షేర్ బజార్లు వణికిపోయాయి. స్టాక్ మార్కెట్లు కుప్పకూలినాయి. కోట్లకు పడగలెత్తిన ఎందరో కామందుల పుట్టి మునిగింది. పరిశ్రమలు, నిధులు అందక కాయిలాపడ్డాయి. ప్రైవేటు సెక్టారులోని లక్షలాది మంది ఉద్యోగులు ఉపాధిని కోల్పోయారు. శీఘ్రగతిన అభివృద్ధి చెందుతున్న భారత దేశాన్ని కూడా ఈ సంక్షోభ దావానలం చుట్టుముట్టింది. రెండవ ప్రపంచ యుద్ధం(1945) తర్వాత ప్రపంచాన్ని ఇంతగా కుదిపివేసిన ఘటన ఇదొక్కటే అంటే అతిశయోక్తి కాదు.

చూడబోతే ఇదేదో ప్రకృతి వైపరీత్యం కాదు– ఇది ముమ్మాటికీ మానవమాత్రుల స్వయంకృత ఫలితమే. ఎన్నో భూకంపాలకు, వరదలకు, తుఫానులకు, ఉప్పెనలకు, సునామీలకు, హరికేన్లకు తట్టుకోగలిగిన ప్రపంచం ఈ ఏటి ఆర్థిక సంక్షోభానికి తట్టుకోలేక గిలగిలా కొట్టుకుంది. నిన్నటివరకూ భోగభాగ్యాలలో ఓలలాడిన శ్రీమంతులు రాత్రికి రాత్రే దివాలాతీసి రోడ్డున పడ్డారు.

పరిస్థితి విషమించిన మీదట గాని ఆర్థిక నిపుణులు కళ్లు తెరవలేదు. ఇప్పుడు వారు పెట్టుబడి దారీ విధానంలోని లొసుగులను తూలనాడుతున్నారు. వడ్డీ వ్యవస్థను ఎండగడుతున్నారు. ఆర్థిక సుడిగుండం నుంచి బయటపడాలంటే అతి తక్కువ వడ్డీ రేటుపై జాతీయ బ్యాంకులు రుణాలివ్వాలని కొందరంటే, వడ్డీ ఊసే ఎత్తవద్దని మరి కొందరు కుండబద్దలు గొట్టి చెప్పారు.

యదార్థమేమిటంటే మానవమేధ పరిమితమైనది. తన మనుగడ కోసం మానవుడు ఏ సిద్ధాంతాన్ని ప్రతిపాదించుకున్నా అందులో లోపాలు లేకుండా ఉండవు. మానవ కల్పితమైన పెట్టుబడిదారీ విధానం కూడా లోపాలకు అతీతం కాదు. దాని వైపరీత్యాల (Paradox) లో 'వడ్డీ' ది సింహభాగం. అది సమాజంలో అవసరార్థుల రక్తాన్ని పీల్చి, ఆర్థిక అంతరాలను పెంచి, వర్గ సంఘర్షణలకు దారి తీస్తుంది. వడ్డీ ఆసాముల కబంధ హస్తాలలో ఒకసారి చిక్కుకున్న బీదలు అంత సులువుగా బయటపడలేరు. వడ్డీ వర్ధిల్లే చోట ధరలు అవశ్యంగా పెరుగుతాయి. ఈ విషయాన్ని 'నెలవంక' అర్నెల్ల క్రితమే (2008 మే, జులై సంచికలలో) చెప్పింది. ఇప్పటికీ అదే చెబుతుంది.

నేటికీ ప్రపంచం ముందు ప్రత్యామ్నాయ మార్గం ఉంది. వడ్డీ వ్యవస్థకు ఇకనయినా గుడ్‌బై చెప్పి, వర్తక ప్రాతిపదికపై బ్యాంకింగ్ పద్ధతిని నిర్వహించాలి. ఏమాత్రం ప్రోత్సాహం లేని పరిస్థితుల్లో కూడా కొన్ని ముస్లిం దేశాలు వడ్డీ రహిత ఇస్లామిక్ బ్యాంకులను స్థాపించి నడిపిస్తున్నాయి. ఒక వైపు వడ్డీ ప్రాతిపదిక గల వాణిజ్య బ్యాంకులు దివాలా తీస్తుంటే, మరోవైపు ఈ వడ్డీరహిత బ్యాంకులు ఎలాంటి ఆటుపోటులకు గురికాకుండా సాఫీగా నడుస్తున్నాయి. వర్ధమాన దేశమైన బంగ్లాదేశ్‌లోని ఇస్లామిక్ బ్యాంకు, ఆ దేశంలోని ఇతర ప్రభుత్వ బ్యాంకులన్నింటికన్నా విజయవంతంగా ముందుకు దూసుకుపోతోంది. ప్రపంచ వ్యాప్తంగా అలుముకున్న ఈ ఆర్థిక చీకటిలో అలమటించే బదులు, అల్లంత దూరాన కానవచ్చే చిరుదివ్వెను ఆశ్రయించాలి. దానికి మరింత తైలం పోసి జ్యోతిర్మయం చేయాలి. ఆ జ్యోతితో 'తమస్సు' ను పటాపంచలు చేయాలి. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న లోకానికి నూతన సంవత్సర శుభసందర్భంగా ఉడుతాభక్తిగా 'నెలవంక' ఇచ్చే సందేశమిదే!

ఇబ్నె యూనుస్

# దేవుడు చేసిన మనుషులకు పక్షి నేర్పే తౌహీద్ పాఠం



**దేవుడు** తన ప్రవక్తలలో కొందరికి మరి కొందరిపై కొన్ని ప్రత్యేక అంతస్తులను ప్రసాదించాడు. ఉదాహరణకు: ఆయన ప్రవక్త మూసాతో సంభాషించాడు. దావూదు ప్రవక్త దైవస్తోత్రం చేస్తుంటే పర్వతాలు కూడా ఆయనతో కలిసి వంతపాడేవి. దావూదు వారసులైన సులైమాను (అలైహిస్సలాం) కి కూడా ప్రవక్తా పదవితో పాటు, బ్రహ్మాండమైన రాజ్యాధికారం ప్రసాదించబడింది. ఆయన పశుపక్ష్యాదులతో సయితం మాట్లాడేవారు. జిన్నాతులు ఆయన అదుపులో ఉంటూ గొప్ప కట్టడాలు నిర్మించేవారు. సాగర గర్భంలో మునకలు వేసి విలువైన ముత్యాలు పగడాలను వెలికి తీసేవారు. అలాగే పక్షులు ఆయనకు పదాతి దళంగా ఉండేవి. వాటిలో కొన్ని పక్షులు గూఢచార కార్యకలాపాలను నిర్వర్తిస్తే, మరి కొన్ని పక్షులు భూగర్భంలోని జల వనరుల గురించి తెలియజేసేవి.

ఒకనాడు దైవప్రవక్త సులైమాన్(అ) తన సేనావాహినిని తనిఖీ చేస్తూ ఆకాశం వంక చూశారు. పక్షులు ఎప్పటిలాగే గగన తలంలో గుంపులు గుంపులుగా మిగ్ విమానాల మాదిరిగా ముచ్చట గొలిపే విన్యాసాలు చేస్తున్నాయి. వాటిలో ఒక్క పక్షిమాత్రం ఆబ్సెంట్ అయి వుంది. రాజుగారి నిశిత దృష్టి ఎటువంటిదో చూడండి! వెంటనే ఆయన కన్నెర్ర జేశారు. ఆయన భృకుటి ముడిపడింది.

> "అరె! నాకు హుద్‌హుద్ పక్షి (వడ్రంగి పిట్ట) కనబడటం లేదే!? నిజంగానే అది ఆబ్సెంట్ అయిందా!? ఒకవేళ అదే నిజమైతే నేను దాన్ని కఠినంగా శిక్షిస్తాను. లేదా దాన్ని కోసివేస్తాను. లేదంటే అది నాకు స్పష్టమైన సంజాయిషీ అన్నా ఇవ్వాలి."

అట్టే ఆలస్యం కాకుండానే ఆ పిట్టవచ్చేసింది. చాలా పెద్ద విషయాన్నే తీసుకువచ్చింది. అది ఇలా విన్నవించుకున్నది–

> మహారాజా! మీకు తెలియని ఒక వింత సమాచారం మోసుకువచ్చాను. (యమన్ ప్రదేశంలో) సబా జాతి వారిని ఒక స్త్రీ పరిపాలిస్తున్నది. ఆమెకు ప్రతి వస్తువూ ఇవ్వబడింది. ఆమె సింహాసనం చాలా గొప్పది..."

సులైమాన్(అ) ఆశ్చర్యపోతూ వింటున్నారు. **"కాని మహారాజా! ఆమెతోపాటు, ఆమె ప్రజలు సర్వజ్ఞాని అయిన దైవాన్ని కాదని సూర్యునికి సాష్టాంగపడుతున్నారు. వారి కర్మలను సైతాను వారికి అందమైనవిగా చూపించాడు."**

ఈ పక్షి అందజేసిన సమాచారం ఆధారంగా సులైమాను(అ) సబా రాణి బిల్ఖీస్‌కి లేఖ వ్రాయటం, కడకు ఆమె నిజదైవానికి విధేయతను ప్రకటిస్తూ, తన రాజ్యప్రజలను పెద్ద విపత్తు నుండి కాపాడటం...అదంతా ఎంతో ఘనమైన చరిత్ర...

కాని ఇక్కడ మనం కాస్త ఆగి ఆలోచించాల్సిన విషయం ఒకటుంది.

దేవుడు చేసిన మనుషులు తమ నిజదైవానికి సాష్టాంగపడకుండా, దైవంచే సృష్టించబడిన సూర్యునికి ప్రణమిల్లటం ఆ పక్షికి వింతగా తోచింది. ఆ విషయాన్ని అది జీర్ణించుకోలేక సతమతమయింది. ఆ వింత విషయాన్ని తన రాజు గారికి చేరవేయటంతో పాటు, సైతాను మాయోపాయాలవల్లనే సబా జనులు అలా చేస్తున్నారని వ్యాఖ్యానించింది. ఆ విధంగా ఆ పక్షి తన అంతరాత్మ ప్రబోధాన్ని స్పష్టంగా ప్రకటించి, మానవాత్మను నిలదీసింది.

ఇది మూడు వేల ఏండ్ల క్రిందటి మాట!

కాని రాకెటెక్కి వైజ్ఞానిక బడాయి చాటుకుంటున్న ఆధునిక యుగపు మానవుడు తనకంటే హీనమైన వస్తువులను పూజిస్తున్నాడు. తన స్వహస్తాలతో చేసిన బొమ్మల ముందు మోకరిల్లుతున్నాడు. దిగంబర సన్యాసుల కాళ్లను నెత్తిమీద కొట్టించుకుని ఆశీర్వాదం పొందుతున్నాడు. సమాధుల వద్ద సాష్టాంగపడుతున్నాడు. సాటి మానవుణ్ణి "పూజ్యులు..." అంటూ సంబోధిస్తున్నాడు. ఒక చిన్న పక్షిని వ్యాకులతకు గురి చేసిన ఈ 'విషయం' సృష్టి శ్రేష్ఠుడైన మనిషి మేధకు తట్టకపోవటం శోచనీయం కదూ! ■



అబూ అనస్

# మీడియా వైఖరి మారాలి

నిజాలను నిగ్గుదేల్చనిదే వార్తలను పత్రికల్లో ప్రచురించరాదు. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు కాలం మారింది. దాంతోపాటు మీడియా తీరు కూడా మారినట్లుంది. యావత్ప్రపంచంలో శరవేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అలాంటప్పుడు తనొక్కతే పురాతన 'విలువల'ను అంటిపెట్టుకొని కూర్చుంటే ఏం లాభం? అని భావించిందేమో. అందుకే వార్తా కథనాల్లో తనూ ఓ సరికొత్త బాటని ఎంచుకుంది మీడియా రంగం. వినడానికి ఈ మాట పత్రికలు, ప్రసార సాధనాలు నడుపుతున్న ప్రముఖులకు చేదు అనిపించినా కొన్ని కొన్ని విషయాల్లో మీడియా అవలంబిస్తున్న తీరు మాత్రం ప్రజలు ఆ రకంగా అనుమానించటానికి ఆస్కారం కల్పిస్తోంది. ఆధునిక మీడియా రంగం ఎంచుకున్న ఆ సరికొత్త బాట సమాజంలోని మేధావుల్ని, ఆలోచనాపరుల్ని కలవరానికి గురిచేస్తోంది. ప్రజల మధ్య సఖ్యతను, శాంతిసౌమనస్యాలను పెంచిపోషించే వార్తలకు తక్కువ ప్రాధాన్యత ఇవ్వటం! మరోవైపు దేశరక్షణకు, సామాజిక సహజీవనానికి ముప్పుగా పరిణమించటానికి ఆస్కారం ఉన్న మాటల తూటాలను -నిజానిజాలను నిగ్గుదేల్చకుండానే- బహిరంగంగా పేల్చేయటం! ఇదే, మీడియా అనుసరిస్తున్న ఆ సరికొత్తబాట!

మీడియా అనుసరిస్తున్న ఈ వైఖరి పట్ల ఇప్పుడిప్పుడే సామాన్యుల హృదయాల్లో అసంతృప్తి సెగలు రగులుకుంటున్నాయి.

ఇక ప్రముఖుల సంగతి! దేశంలో ఇప్పటికే ఎన్నోచోట్ల మీడియా వైఖరికి వ్యతిరేకంగా మేధావి వర్గం అసంతృప్తి గళం విప్పింది. దేశంలోని ప్రధాన నగరాల్లో దీనిపైన వాడివేడి చర్చలు కూడా ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా సభలు, సమావేశాలు ఏర్పాటవుతున్నాయి. అటువంటి వాటిల్లో ముఖ్యంగా ప్రస్తావించదగిన ఒక సమావేశం 'తీవ్రవాద నిరోధకంలో మీడియా పాత్ర' అన్న అంశంపై 'పీస్ హైద్రాబాద్' ఇటీవల నిర్వహించిన సదస్సు. సమాజంలోని విభిన్న వర్గాలకు చెందిన మేధావులు, ప్రభుత్వేతర సంస్థలు ఎంతో చొరవతో సంయుక్తంగా నిర్వహించిన సదస్సు ఇది. ఈ సమావేశం ప్రస్తుత కాలంలో వార్తాకథనంలో మీడియా అనుసరిస్తున్న పక్షపాత వైఖరిని దుయ్యబట్టింది.

కమ్యూనికేషన్ రంగం అభివృద్ధి చెందటంతో ప్రపంచవ్యాప్తంగా నేడు ప్రచార ప్రసార రంగాలు మునుపెన్నడూ లేని విధంగా అంతర్జాతీయ సమాజంలో ఒక ప్రతిష్ఠాత్మకమైన స్థానాన్ని సంపాదించుకున్నాయి. నిజాయితి, చిత్తశుద్ధి, పారదర్శకత, సమాచార సేకరణ వంటి మేలిమి భావాలతో ఉద్భవించిన మీడియా వ్యవస్థ అనతికాలంలోనే సమాజంలోని ఇతర మరెన్నో రంగాలను శాసించగల స్థాయికి ఎదిగింది. రాజ్యంలో ప్రధాన అంగాలైన శాసన నిర్మాణ శాఖ, కార్యనిర్వాహకశాఖ, న్యాయశాఖలతోపాటు మీడియాకు కూడా సమున్నత స్థానం లభించింది. మరి మీడియాకు ఇంత గౌరవం లభించటానికి కారణం ఎవరు? ప్రజలే




కదా! మీడియాకు ప్రజల ఆదరణ పుష్కలంగా లభిస్తోంది. ప్రజల నమ్మకమే మీడియాను ముందుకు నడిపిస్తోంది. పాత్రికేయ, ప్రసార రంగాలు ప్రగతి శిఖరాలనధిరోహించేందుకు ప్రజావిశ్వాసమే సోపానాలను సమకూర్చుతోంది. మరి ఆ నమ్మకమే వమ్ము అయితే...? పత్రికా ఖ్యాతి ప్రజాకోర్టులో అపఖ్యాతి పాలవటానికి ఎంతో సమయం పట్టదు. పురివిప్పుకొని పరుగెడుతున్న ప్రసార రంగ ప్రగతి అధోగతిగా మారిపోవటానికి ఎంతోకాలం అవసరం లేదు. ప్రస్తుత కాలంలో మీడియా ప్రదర్శిస్తున్న పక్షపాత వైఖరిని చూస్తే అది ఈ వాస్తవాన్ని ఒంటబట్టించుకున్నట్లుగా కానరావటంలేదు. పీస్ హైద్రాబాద్ వంటి బుధజన సమావేశాల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తి గళం ఈ సత్యాన్ని తేటతెల్లం చేస్తోంది.

దేశంలో వివిధ భాషలకు చెందిన పత్రికా, ప్రసార సంస్థలున్నాయి. మరి ఆ సంస్థలన్నీ పరస్పరం సమన్వయంతో, సహకారంతో, సంఘీభావంతో పని చేస్తున్నాయా అన్నది పలువురిని తొలిచివేస్తున్న ప్రశ్న. మీడియా రంగం ప్రజాసంబంధాల వ్యవస్థకే తలమానికం. అటువంటి మీడియా సంస్థల మధ్య సామరస్యం, సమన్వయం, సహకారం కొరవడితే దాన్ని పత్రికా ప్రచార రంగంలోని ఒక చిన్న లోపంగా భావించటానికి వీల్లేదు. ఎందుకంటే అది మొత్తం మీడియా పనితీరునే ప్రభావితం చేస్తుంది. దేశంలో ఒక ప్రాంతంలోని వార్తాపత్రికలకు ఆ ప్రాంతపు వార్తలు ముఖ్యం కావచ్చు. ఒక ప్రత్యేక భాషలో నడిచే మీడియాకు ఆ భాషకే సంబంధించిన వింతలు, విశేషాలు ఎక్కువ అవసరమైనవి కావచ్చు. కాని దేశంలో ఏ మీడియాకైనా అంతిమ లక్ష్యం దేశప్రయోజనాలు, దేశాభివృద్ధి, దేశభద్రత, ఉత్తమ ప్రజాసంబంధాలు. ఈ లక్ష్యం నెరవేర్పు కోసం మీడియా దేశప్రయోజనాలకు సంబంధించిన వార్తలకు అధిక ప్రాధాన్యమివ్వాలి. దేశప్రజల శాంతికి, సఖ్యతకు దోహదపడే వార్తలను పతాక శీర్షికన ప్రచురించాలి. అలా కాని పక్షంలో మీడియా తన బాధ్యత విస్మరించినట్లే, ప్రజల నమ్మకం మీద నీళ్లు చల్లినట్లే ఇక్కడ ఒక విషయం అప్రస్తుతం కాదు. దక్షిణ భారతదేశంలో తమిళం, మరాఠీ, హిందీ మొదలగు మీడియా సంస్థల కన్నా తెలుగు మీడియా పనితీరు అత్యంత ప్రభావవంతంగా ఉందని అనేక సర్వేలు వెల్లడి చేస్తున్నాయి. మరి అటువంటి గొప్ప మీడియా వ్యవస్థకు స్థానిక మీడియా సంస్థలతో ఉన్న సంబంధాల గురించి తెలిస్తే ప్రజలు నివ్వెరపోతారు.

**ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు పత్రికలది ఒక లోకమైతే, స్థానిక ఉర్దూ పత్రికలది మరో లోకం. రెండింటి వార్తాకథనాలకు భూమ్యాకాశాలకు మధ్య ఉన్నంత తేడా ఉంటుంది. రెండింటి పతాక శీర్షికలు ఒకే రీతిలో సాగిన సందర్భాలు మచ్చుకుగాని కానరావు. రెండు భాషలూ తెలిసిన ప్రజలకు ఈ మీడియా ద్వయం మధ్య ఏర్పడి ఉన్న మహా అగాధం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.**

ఈ మహా అగాధం కొంతవరకైనా పూడితే మత కల్లోలాలపరంగా, వర్గవిభేదాలపరంగా సున్నిత ప్రాంతాలుగా భావింపబడే హైద్రాబాద్, తెలంగాణా జిల్లాల్లో శాంతిసామనస్యాలు వెల్లివిరిసి, స్థానిక ప్రజల మధ్య సదవగాహన ఏర్పడుతుందన్నది మేధావుల మనోగతం. ఏది ఏమైనా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండు కళ్లులాంటి ఈ మీడియా సంస్థల మధ్య అంతరం తొలగిపోతే హైద్రాబాద్ మహానగరంలో పరిస్థితులు మెరుగు పడతాయన్న విషయంలో మాత్రం సందేహం లేదు.

ఇక్కడ మరో విషయం కూడా ప్రస్తావించుకుంటే సమస్యను కూలంకషంగా అర్థం చేసుకున్నట్లవుతుంది. నేడు మనదేశాన్ని పట్టి పీడిస్తున్న జటిల సమస్య ఉగ్రవాదం. దారినపోయే ఏ దానయ్యను అడిగినా ఇదే సమాధానం చెబుతాడు. తీవ్రవాదుల వరుసబాంబు పేలుళ్లతో దేశం అతలాకుతలమైపోతుంది. దేశ ప్రజలు క్షణక్షణం భయంతో బిక్కు బిక్కు మంటూ బతుకు వెళ్ళదీస్తున్నారు. దేశరాజకీయాలన్నీ ఈ తీవ్రవాదానికి చుట్టానే పరిభ్రమిస్తున్నాయి. మనదేశ స్వార్థరాజకీయాలు ఈ తీవ్రవాదానికి మతంతో లింకు పెడుతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో మీడియా బాధ్యత మరింత పెరిగిపోతుంది. మీడియాకు వాస్తవాలను వెలికితీసి ప్రజానమ్మకాన్ని ప్రోదిచేసుకోవలసిన తరుణం ఇదే. కాని మన మీడియా ఈ గురుతర బాధ్యతను గుర్తెరగటం లేదు. పైగా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంది. ప్రభుత్వం, రాజకీయ నాయకులు 'తానా' అంటే మీడియా కూడా వారితో శృతి కలుపుతూ 'తందానా' అంటోంది. దేశంలో ఎక్కడ బాంబు పేలుళ్లు జరిగినా క్షణం ఆలోచించకుండా ఇక్కడ న్యాయ శాఖ ఒకటి ఉందన్న సంగతిని కూడా మరచి తనంతట తానుగా దేశంలోని ఒక్క వర్గాన్ని 'దోషి' గా నిలబెడుతోంది.




బాంబు పేలుళ్లు జరిగినప్పుడు క్షణాల్లో ఇస్లామిక్ తీవ్రవాదం పేరుతో ప్రజల దృష్టిని మళ్ళించే విషయమై మీడియా అమితాసక్తిని కనబరుస్తుంది. మరి అదే మీడియా ముస్లిములందరూ కలసి తీవ్రవాదం పట్ల విసుగును, కోపాన్ని వెళ్లగ్రక్కిన వార్తలను దేశప్రజలందరికీ బోధపడేలా ప్రచురించటంలో ఏ మాత్రం ఆసక్తిని కనబరచకపోవటం మీడియా ద్వంద్వ నీతిని చాటుతోంది. మొన్నటికి మొన్న హైదరాబాదు నగరం నడిబొడ్డున దేశవ్యాప్తంగా మహామేధావులైనటువంటి ముస్లిం మత పండితులు చారిత్రాత్మకంగా భావించదగ్గ ఒక బహిరంగసభను ఏర్పాటు చేసారు. వేలాదిమంది ముస్లింలు ఈ సభకు హాజరై తీవ్రవాదాన్ని నిరోధించే విషయంలో తామందరిదీ ఒకే మాట, ఒకే బాట అని రుజువుచేశారు. దేశభక్తి విషయంలో తమ చిత్తశుద్ధిని శంకించటాన్ని సవాలు చేస్తూ, దేశరక్షణ పట్ల తమ నిజాయితీని నిరూపించుకున్నారు. తీవ్రవాదానికి ఇస్లాంతో ఎలాంటి సంబంధం లేదని, అసలు ప్రపంచంలో ఏ మతమూ తీవ్రవాదాన్ని ప్రబోధించదని సభాముఖంగా కుండబద్దలు చేసి మరీ ప్రకటించారు. అది ఒక ప్రకటన మాత్రమే కాదు. భారతదేశంలోని ప్రతి ముస్లిం గుండెచప్పుడు. మీడియా గనక చొరవ తీసుకుని ఉంటే ముస్లింల ఈ గుండెచప్పుడు దేశప్రజలందరికీ వినపడేది. ప్రజల మధ్య ఉన్న అపోహలు కొన్నయినా దూరమయ్యేవి. కాని మన పత్రికలు, టీ.వి ఛానెళ్ళు అసలు ఈ వార్తకు తగినంత ప్రాముఖ్యత ఇవ్వకపోవటం ముస్లింలను నిరాశపరిచింది.

మనదేశ మీడియా అనుసరిస్తున్న వైఖరి పట్ల ఇటువంటి అసంతృప్త భావనల సాకారమే పీస్ హైద్రాబాద్ సదస్సు. డా.విఠల్ రాజన్, డా.పి.ఎస్.భార్గవ, ప్రొఫెసర్ శ్రీమతి రమ మల్‌కోటె, షఫీఖ్ ముహాజిర్ (సీనియర్ అడ్వొకేట్), రవిచందర్(సీనియర్ అడ్వకేట్) మేజర్ గౌస్ ఖాద్రి లాంటి ప్రముఖ వ్యక్తులు, కోవా, హెల్ప్ హైద్రాబాద్ లాంటి కొన్ని ప్రభుత్వేతర సంస్థలు సంయుక్తంగా 'పీస్ హైద్రాబాద్' గా ఏర్పడి, ప్రెస్ అకాడమీ అధ్యక్షులు శ్రీ దేవులపల్లి అమర్ సలహా మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీమతి అర్షియా అహ్మద్ అయ్యూబ్ మధ్యవర్తిత్వంతో ఈ సమావేశంలో మీడియా తీరుతెన్నుల పైన చర్చకొనసాగింది. దేశరక్షణకు, భద్రతకు సంబంధించిన చాలా విషయాల్లో మన మీడియా నిజాయితీగా, నిష్పక్షపాతంగా వ్యవహరించటం లేదని, రానురాను మీడియా కూడా రాజకీయ రంగు పులుముకుంటోందని ఈ సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మన దేశంలో రాజకీయ వ్యవస్థ లాగా మీడియా వ్యవస్థ కూడా ప్రజా విశ్వాసాన్ని కోల్పోయే రోజు ఎంతో దూరంలో లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటివంటి సమావేశాల నుంచి మన మీడియా ఎంత తొందరగా గుణపాఠం గ్రహిస్తుందో వేచి చూడాలి.



కువైట్ కబుర్లు



ముహమ్మద్ హనీఫ్

# ఏయ్ భాయ్! జరా దేఖ్‌కే చలావ్!!

**ఎడారి** ఇసుక ప్రాంతంలో సువిశాలమైన రోడ్లు, రౌండ్ అబౌట్స్, ఫ్లై వోవర్లు, పటిష్టమైన సిగ్నలింగ్ వ్యవస్థ, అప్రమత్తంగా ఉండే ట్రాఫిక్ సిబ్బంది, అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్లుగా వాయు కాలుష్యాల నియంత్రణ ద్వారా కువైట్ అంతర్జాతీయస్థాయి ఆధునిక దేశంగా అలరారుతోంది. రోడ్లు సౌకర్యవంతంగా వుంటేనే సరిపోదు. అవి సురక్షితంగా కూడ వుండాలి. ఎందుకంటే రెప్పపాటు ఏమరపాటు ఎన్నో జీవితాలను కబళించివేస్తుంది. తన జీవితంతోపాటు యితరుల జీవితాలను పొట్టన పెట్టుకుంటుంది. అందుకే కువైట్ ప్రభుత్వం సురక్షితమైన రవాణా వ్యవస్థకోసం కొన్ని కట్టుదిట్టమైన నిబంధనలను విధించి, వాటిని అతిక్రమించిన వారికి కఠినమైన శిక్షలు జరిమానాలను కూడా నిర్దేశించింది. జులై 2006 నుండి పాత నిబంధనల స్థానే కొత్తగా రూపొందించిన పాయింట్ల పద్ధతిని ప్రవేశపెట్టింది.



ప్రతి అతిక్రమణకు జరిమానాతో పాటు కొన్నింటికి జైలు శిక్షలు కూడ నిర్దేశించినది.

| ఉల్లంఘనా వివరాలు | పాయింట్లు |
|---|---|
| రెడ్ లైటు సిగ్నల్ క్రాస్ చేయటం | 4 |
| సూచించిన వేగపరిమితికి మించి వేగంగా నడపడం | 4 |
| రవాణా ప్రవాహానికి వ్యతిరేక దిశలో వాహనం నడపటం | 3 |
| సరయిన లైసెన్స్ లేకుండా వాహనం నడుపటం | 3 |
| ఉపసంహరించుకున్న లేదా గడువు ముగిసిన లైసెన్సుతో వాహనం నడపడం | 3 |
| నిర్లక్ష్యంగా వాహనం నడపటం | 4 |
| అనుమతి లేని వాహనం నడుపటం | 3 |
| చెరిపి వేయబడిన నంబరు ప్లేటు, నంబరు ప్లేటె లేకుండా వాహనం నడపటం | 3 |
| ప్రైవేటు వాహనంలో ప్రయాణీకులను చేరవేయటం | 2 |
| ఉద్దేశ్యపూర్వకంగా రహదారికి ఆటంకం కల్గించడం | 2 |
| బ్రేకులు సరిగాలేని వాహనం నడపటం | 2 |
| ప్రయాణీకుల పరిమితిని పాటించకపోవడం | 1 |
| వాహన పొడవు, వెడల్పు, బరువులను అతిక్రమించడం | 1 |
| రహదారి గీతలు (Traffic lines) మరియు రహదారి గుర్తులను పాటించకపోవడం | 1 |
| U టర్న్ తప్పుగా తీసుకోవడం | 1 |
| తప్పుడు వాహన పర్మిట్‌తో వాహనం నడుపడం | 1 |
| వాహనం నుండి పరిమితికి మించి పొగ రావడం | 1 |








పై పట్టికలో చూపిన అతిక్రమణలకు విధించిన జరిమానా లతోపాటు పాయింట్ల ఆధారంగా అదనపు శిక్షలు కూడ విధించబడతాయి.

| పాయింట్లు | పర్యాయము | శిక్ష |
|---|---|---|
| 14 | తొలిసారి అతిక్రమించిన వారికి | 1 నెల లైసెన్సు ఉపసంహరణ |
| 12 | రెండవ సారి అతిక్రమించిన వారికి | 6 నెలలు లైసెన్సు ఉపసంహరణ |
| 10 | మూడవ సారి అతిక్రమించిన వారికి | 9 నెలలు లైసెన్సు ఉపసంహరణ |
| 8 | నాల్గవ సారి అతిక్రమించిన వారికి | 1 సంవత్సరం లైసెన్సు ఉపసంహరణ |
| 6 | ఐదవ సారి అతిక్రమించిన వారికి | లైసెన్సు పూర్తిగా రద్దు |

లైసెన్సు ఉపసంహరించినప్పుడు లేదా ఎలాంటి అతిక్రమణ పునరావృతం కానప్పుడు మాత్రమే జమ అయిన పాయింట్లు తొలగించబడతాయి. అతిక్రమణ ప్రాణాంతకమైనప్పుడు విధించబడే అత్యధిక జరిమానా లేదా శిక్ష.



| అతిక్రమణ | అత్యధిక జరిమానా | శిక్ష |
|---|---|---|
| రెడ్ సిగ్నల్ క్రాస్ | 300 దీనార్లు | 3 నెలల జైలు శిక్ష |
| మత్తుపదార్థాలు సేవించి వాహనం నడపడం | 500 దీనార్లు | 1 సంవత్సరం జైలు శిక్ష మరియు లైసెన్సు ఉపసంహరణ |

ఈ క్రింది సమయాలలో చట్టాలను సంకేతాలను ఉల్లంఘించినప్పుడు డ్రైవర్లను అరెస్టు చేసే అధికారం పోలీసు వారికి కలదు.

(1) సక్రమమైన లైసెన్సు లేకుండా వాహనం నడపినప్పుడు.

(2) మద్యం లేదా మాదకద్రవ్యాలు సేవించి వాహనం నడిపినపుడు.

(3) ప్రాణాంతక తీవ్రగాయాలకు కారణమైన ప్రమాదం చేసినపుడు.

(4) పబ్లిక్ రహదారులపై రేసింగ్ చేసినపుడు.

(5) పోలీసులు ఆపినపుడు ఆగకుండా లేదా యాక్సిడెంట్ చేసి పారిపోవడానికి ప్రయత్నించినపుడు.

(6) ఇతరులకు ప్రమాదకరంగా - అజాగ్రత్తగా-వాహనం నడిపినపుడు.





సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

పవిత్ర జీవితం

ఆధారం
అర్రహీఖుల్ మఖ్తూమ్

సంక్షిప్తీకరణ
సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

# నిర్యుద్ధ సంధి ఫలితాలు

## చక్రవర్తులకు లేఖ సందేశం

హుదైబియా ఒడంబడిక ఫలితంగా మదీనాలో ముస్లింలకు కొంత కాలం ప్రశాంతంగా ఊపిరి పీల్చుకునే అవకాశం చిక్కింది. దైవ సందేశాన్ని దైవ దాసులకు చేరవేయటానికి ఇది బంగారు అవకాశం. అందుకే హిజ్రీ శకం 6వ సంవత్సరం చివర్లో దైవ ప్రవక్త (స) ఆనాటి గొప్ప గొప్ప చక్రవర్తులకు ఇస్లాం వైపు ఆహ్వానిస్తూ సందేశ లేఖలు వ్రాశారు (వ్రాయించారు). ఈ లేఖలు వ్రాయించాలని సంకల్పించినప్పుడు చక్రవర్తులు ముద్ర లేకుండా అంగీకరించరని చెప్పబడింది. అప్పుడు మహా ప్రవక్త (స) ఆ లేఖల మీద ముద్ర కోసమని ప్రత్యేకంగా ఒక వెండి ఉంగరాన్ని చేయించారు. దాని మీద "ముహమ్మదుర్రసూలుల్లాహ్" అనే అక్షరాలుండేవి. ఆ తర్వాత హబ్షా చక్రవర్తి నజాషీని ఇస్లాం వైపు ఆహ్వానిస్తూ ఓ లేఖ వ్రాసి పంపారు. నజాషీ ప్రవక్త (స) గారి ఆహ్వానాన్ని స్వీకరించి తన ఇస్లాంను ప్రకటించాడు. అలాగే ప్రవక్త (స) ఈజిప్ట్ పాలకుడు 'ముఖౌఖిస్' పేర కూడా ఓ లేఖను పంపారు. ముఖౌఖిస్ ఇస్లాం స్వీకరించలేదు. కానీ దైవ ప్రవక్త (స) కోసం విలువైన కానుకలు ఇచ్చి పంపాడు. ఇంకా అతను 'మారియా ఖిబ్తియా' అనే సేవకురాలిని కూడా దైవప్రవక్త (స) కు బహూకరించాడు. ఈమెను ప్రవక్త (స) వివాహమాడారు. ఆమె ద్వారానే ఆయనకు 'ఇబ్రాహీమ్' అనే కుమారుడు జన్మించాడు.

అదే విధంగా ఈరాన్ రాజు 'కిస్రా' పేర కూడా అతన్ని ఇస్లాం వైపు ఆహ్వానిస్తూ లేఖ వ్రాశారు. అతను ఆ లేఖను చింపి పారేశాడు. ఈ సంగతి తెలుసుకున్న దైవప్రవక్త (స) అల్లాహ్ అతని సామ్రాజ్యాన్ని తునాతునకలు చేసి, అతడికి స్థాన భ్రంశం చేయుగాక అని శపించారు. ఇలా శపించిన కొన్నాళ్ళకే ప్రవక్త (స) దుఆ నిజమయింది. కిస్రా సొంత కుమారుడైన 'షేర్వైహ్' తండ్రిపై తిరుగుబాటు చేసి, అతన్ని హతమార్చి సింహాసనాన్ని తన కైవసం చేసుకున్నాడు.

రోము చక్రవర్తి 'ఖైసర్' (హెరక్లియస్) పేరిట కూడా ఒక లేఖ పంపారు. అప్పుడు ఆయన మహా ప్రవక్త (స) గురించి వివరాలు తెలుసుకోవడానికి అరబ్బు వర్తకుల్ని గురించి ఆరా తీశాడు. యాధృచ్ఛికంగా ఆ రోజుల్లో ఖురైషుల నాయకుడు అబూ సుఫ్యాన్ వ్యాపార నిమిత్తం సిరియా దేశానికి వచ్చియున్నాడు. ఖైసర్ దర్బారులో హాజరయిన అబూ సుఫ్యాన్ ప్రవక్త (స) గారి గుణ విశేషాల్ని గొప్పగా వర్ణించడంతో పాటు, ఇస్లాం ధర్మమే సత్య ధర్మం అని కూడా అంగీకరించాడు. అయితే తాను మాత్రం ఇస్లాం స్వీకరించలేదు. అలాగే బహ్రైన్, ఒమాన్, యమన్ దేశ పాలకుల పేరున కూడా లేఖలు పంపారు. ఆ తర్వాత హిజ్రీ శకం 7వ సంవత్సరంలో దైవప్రవక్త (స) అబూ సుఫ్యాన్ కూతురు 'రమ్లా'ను వివాహమాడారు. ఆమె 'ఉమ్మె హబీబా' అనే బిరుదుతో పిలువబడేది. అలాగే ఈ సంవత్సరంలోనే హుయ్యి కూతురగు హజ్రత్ సఫియ్యా (రజి)ను వివాహమాడారు. ఈమె యుద్ధ ఖైదీగా ప్రాప్తమయిన యూద స్త్రీ. ఇంకా ఈ సంవత్సరంలోనే హారిస్ కుమార్తె హజ్రత్ మైమూనా (రజి) గారిని కూడా మనువాడారు.





# ధీర గుణం



- అబూ తఫ్‌హీమ్
mujq8@yahoo.co.in

వైఫల్యం, అపజయం ఎవరినైనా, ఎంతటివారినయినా నిరుత్సాహపరుస్తాయి. నిరాశకు గురికావటం సహజమే. ఆ బాధ పాపం నష్టపోయిన వానికే తెలుసు. అయితే ఇక అలాగే నిరుత్సాహంతో జీవితం గడపాలా? కాదు...నేటి కాంపిటీషన్ యుగం **So What!? next..** (అయితే ఏమైంది!? ఇంకో ప్రయత్నం చేద్దాం) అని నేర్పుతోంది. **"Failure is success, if we learn from it."** (వైఫల్యం నుండి గుణపాఠం మనం నేర్చుకున్నట్లైతే నిజంగా అది సాఫల్యమే.)

రమేష్ ట్రావెల్ ఏజన్సీలో రవి 5 లక్షలతో పార్ట్‌నర్‌గా వ్యాపారం మొదలెట్టాడు. 6 నెలల్లోనే రమేష్ కంపెనీ వారు పెద్ద నష్టమొచ్చిందని నమ్మించి, 4 లక్ష రూపాయలు కోసుకుని మిగిలిన పైకం తిరిగి పంపించేసారు. ఇంత పెద్ద నష్టం జరిగినా రవి ఆనందంగా ఉత్సాహంగా ఉంటే అందరికీ ఆశ్చర్యమేసింది. అదేంట్రా అంటే 1 లక్ష ప్లస్ 4 లక్షల ఎక్స్‌పీరియన్స్ తన దగ్గర ఉందంటూ ఆ లక్ష రూపాయలతో ఓ చిన్న హోటల్ ప్రారంభించాడు. ఆ ఎక్స్‌పీరియన్స్ ఏంటని అడిగితే **"వ్యాపారంలో పార్ట్‌నర్‌షిప్ వద్దు, వ్యాపార లావాదేవీలన్నీ వ్రాత పూర్వకంగా వుండాలి"** అనేదే నా ఎక్స్‌పీరియన్స్ అన్నాడు. ఈ 2 సూత్రాలు పాటిస్తూ మొదలెట్టిన ఓ చిన్న హోటల్ యజమాని ఇప్పుడు ఓ ఫైవ్ స్టార్ హోటల్ యజమానిగా ఎదిగాడు.

విశ్వాసి ఎన్నటికీ నిరాశ చెందడు. ఆత్మ విశ్వాసంతో ప్రయత్నం సాగిస్తూ విజయం కలుగుతుందనే పూర్తి నమ్మకంతో వుంటాడు.

**"ఒకవేళ నీవు నన్ను సంపదలో, సంతానంలో నీకంటే తక్కువ వాడిగా చూస్తూ ఉన్నప్పటికీ, నా ప్రభువు నీ స్వర్గం కంటే ఉత్తమమైన దానిని నాకు ప్రసాదిస్తాడు (18: 39,40) అన్న ఉపదేశాన్ని స్ఫూర్తిగా తీసుకుంటాడు.**

అల్లాహ్ అటువంటి విశ్వాసులకు ఊహించని మార్గం ద్వారా సుఖాన్ని శుభాన్ని విజయాన్ని ప్రసాదిస్తాడు కూడా.



**"ఎవరు అల్లాహ్‌కు భయపడుతూ పని చేస్తాడో, అతనిని అల్లాహ్ కష్టాలనుండి గట్టెక్కే మార్గం చూపుతాడు. ఇంకా అతని ఊహకు కూడా అందనటువంటి మార్గం ద్వారా, అతనికి ఉపాధి ప్రసాదిస్తాడు. అల్లాహ్‌ను నమ్ముకున్నవారికి అల్లాహ్‌యే చాలు. అల్లాహ్ తన పనిని పూర్తి చేసి తీరుతాడు. అల్లాహ్ ప్రతిదానికి ఒక విధి నిర్ణయించి ఉంచాడు. (65: 2,3)**

ప్రవక్త యాఖూబ్(అ) విశ్వాసాన్ని, అల్లాహ్‌పై ఆయనకు ఉన్న నమ్మకాన్ని చూస్తే మీరు ఆశ్చర్యపోతారు. తన కుమారుడు యూసుఫ్(అ) ను అన్నదమ్ములు బావిలో పడవేసి "తోడేలు అతన్ని తినివేసింద"ని అబద్ధం చెప్తారు. నిరూపణగా వారు యూసుఫ్ చొక్కాకు బూటకపు రక్తం పూసి తీసుకువచ్చారు. అంతా చూసి కూడా ప్రవక్త యాఖూబ్(అ) చేసిన దుఆను గమనించండి:

**"నేను నా ఆందోళనను గురించి, నా ఆవేదనను గురించి, అల్లాహ్‌కు తప్ప మరెవరికీ ఫిర్యాదు చెయ్యను. అల్లాహ్‌ను నేను ఎరిగినట్లు మీరు ఎరుగరు" (12:86).**

అసంభవం అన్న సందర్భంలో కూడా ఆశను వదులుకోవద్దు. అందులో శుభం వుంటే ప్రసాదించమనే దైవాన్ని పదేపదే వేడుకోండి. విజయం దగ్గరలోనే వుందని ఆశించి సుఖంగా, ఆనందంగా గడపండి.

వాతావరణాన్ని బట్టి వస్త్రధారణ, అన్నపానీయాల్లో మీరే స్వయంగా మార్పులు చేసుకుంటూ వుంటారు. వేసవికాలం వచ్చినా చలికాలంలో వేసుకున్న వులెన్ కోటు తీయనంటే "ఊపర్ షేర్వానీ, అందర్ పరేషానీ" ని చూసేది మీరే. చలికాలం మరలా తిరిగి వస్తుందనే ఆశతో వేసవికాలం గడపేయండి. పరిస్థితులు ఎన్ని విచిత్ర మలుపులు తిరిగినా ధైర్యంగా వుండండి. వాస్తవానికి కష్టాలు, నష్టాలు మనిషిని మరింతగా రాటు తేలుస్తాయి. ప్రతి విషయాన్ని ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. గాలిబ్ కవి అందుకే ఇలా అన్నాడు –

ముష్కిలే ఇత్నీ పడీఁ ముఝ్ పర్
కె ఆసాన్ హోగయీఁ.

(నాపై ఎన్ని కష్టాలు వచ్చిపడ్డాయంటే! ఇక ప్రతీది సులువైపోయింది).

ఈ దుఆను తప్పక చేస్తూ వుండండి:

**ప్రభూ! ఏ బరువును మోసే శక్తి మాలో లేదో, వాటిని మాపై పెట్టకు. మమ్మల్ని మన్నించు. మమ్మల్ని క్షమించు, మమ్మల్ని కరుణించు. నీవు మాకు రక్షకుడవు. అవిశ్వాసులకు వ్యతిరేకంగా మాకు సహాయపడు. (2: 286)**

# సత్సమాజ నిర్మాణానికి షట్సూత్ర పథకం



అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ



**1.** యువతీ యువకుల స్వేచ్ఛా కలయికను అరికట్టాలి. లైంగిక కోర్కెలను రెచ్చగొట్టి, యువతీ యువకులను పెడదోవ పట్టించే అశ్లీల విషయాలు- బూతు సినిమాలు, అశ్లీలమైన పాటలు, నీతిబాహ్యమైన దృశ్యాలు, అర్థ నగ్న పోస్టర్లు, అశ్లీలం గుప్పించబడిన పుస్తకాలను అరికట్టాలి. ఎన్నో అనర్థాలకు మూలమైన మత్తుపానీయాలను నిషేధించాలి. తల్లిదండ్రులు తమ యువ సంతానానికి పెండ్లి తొందరగా చెయ్యాలి.

**2.** పెండ్లిని సులభతరం చెయ్యాలి. వరకట్నాన్ని నిషేధించాలి. వరకట్నం మూలంగా వివాహం కాకుండా ఏండ్ల తరబడి కూర్చునే యువతులు ఆత్మహత్యలకో, అక్రమ సంబంధాలకో పాల్పడే ప్రమాదముంది.

**3.** స్త్రీల సహజ కార్యాచరణ పరిధి వారి గృహం. ఈ సహజ పరిధిలో వారు ప్రశాంతంగా ఉంటూ, తమ గురుతర బాధ్యతలను నిర్వర్తించాలి. ఇందులోనే వైవాహిక జీవిత మాధుర్యం ఉంది. ఇంటి యజమాని అనుమతి పొందనంతవరకు ఇతరుల ఇండ్లల్లో స్వేచ్ఛగా ప్రవేశించడాన్ని ఆపాలి. అలాగే ఇతరుల ఇండ్లల్లోకి దొంగచాటుగా తొంగి చూడటాన్ని గట్టిగా ఖండించాలి.

భర్త, కొడుకు, తమ్ముడు ఇంట్లో లేని సమయంలో పరాయి మగవారిని ఇంట్లోకి ప్రవేశించే అనుమతి ఇవ్వకూడదు. చివరికి మరిది, బావను కూడా స్వేచ్ఛగా ఇంట్లో ప్రవేశించి, వదిన లేక మరదలితో ఏకాంతంలో సంభాషణలు జరపడాన్ని ఖండించాలి. మరిది, బావ స్త్రీ పాలిట మృత్యువని అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్(స) పేర్కొన్నారు.

**4.** స్త్రీలు పరపురుషులతో మాట్లాడేటప్పుడు మెతకదనం కనబడేలా మృదువుగా మాట్లాడకూడదు. స్పష్టంగా సూటిగా మాట్లాడాలి. ఎందుకంటే అంతర్యంలో చెడుభావాలు ఉన్న వాడ్ని ఈ మెతకదనం దుర్బుద్ధికి పురిగొల్పే ప్రమాదం ఉంటుంది.

మహిళలు- భర్తలు, తండ్రులు, భర్తల తండ్రులు, కన్న కొడుకులు, భర్తల కొడుకులు(సవతి కొడుకులు), సొంత అన్నదమ్ములు, అన్నదమ్ముల కొడుకులు, సొంత అక్కాచెల్లెళ్ల కొడుకులు, తమతో కలిసిమెలిసి ఉండే స్త్రీలు, స్త్రీ వాంఛలేని పురుషులు, స్త్రీల అంతరంగిక విషయాలు తెలియని బాలురు – వీరి ఎదుట తప్ప ఇతరుల ముందు తమ అందచందాలు, అలంకరణలను బహిర్గతం చేయకూడదు. స్త్రీలు అవసర నిమిత్తం ఇంటి నుండి బయటికి వెళ్లితే తమ అందచందాలు, అలంకరణలను ప్రదర్శించకూడదు. వారు తమ పైటలను తమ ముఖాలపై కప్పుకోవాలి. దీనివల్ల చెడు చూపులు వెంటాడి, వారిని వేధిస్తాయనే భయముండదు.

స్త్రీలు తమ చూపులు పరపురుషులపై పడకుండా జాగ్రత్త పడాలి. అలాగే పురుషులు తమ చూపులు పర స్త్రీలపై పడకుండా జాగ్రత్త పడాలి. చెడు చూపులు చెడునడతకు మూలం.

అవివాహితులుగా ఉన్నవారికి- వారిలో పెండ్లి చేసుకోవాలనే కోరిక గనక ఉంటే కుటుంబ పెద్దలు వారి పెళ్ళిళ్లు చెయ్యాలి. కోర్కెలకు కళ్లెం వేయడానికి, చెడునడత నుండి స్త్రీపురుషుల్ని కాపాడటానికి ఇదే ఉత్తమ మార్గం.

**5.** లైంగిక పరంగా పురుషునిలో స్త్రీ కంటే సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల పురుషునికి కొన్ని షరతులతో కూడిన బహుభార్యాత్వపు రాయితీనివ్వాలి. బహుభార్యాత్వం ఒక నైతిక, సాంస్కృతిక అవసరం కూడా. ఒక భార్య ద్వారా సుఖం పొందలేని పురుషునికి రెండవ వివాహం చేసుకొనే అవకాశం లేకపోతే అతను వ్యభిచారానికి పాల్పడవచ్చు.

**6.** సత్సమాజానికి మూలస్తంభమైన కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసే వ్యభిచారం, అక్రమ సంబంధాలను ఎట్టి పరిస్థితిలోనూ సహించకూడదు. ఈ దుష్కార్యానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలి. ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తున్న సంఘ సంస్కర్తలు, పైన ప్రస్తావించబడిన సూత్రాలను గమనించాలి. ఇస్లాం ధర్మం సురక్షిత శృంగారానికి బదులు పవిత్ర శృంగారాన్ని ప్రోత్సహిస్తోంది. సత్సమాజ నిర్మాణ పథంలో తొలిమెట్టు అయిన కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసే వ్యభిచారం, అక్రమ సంబంధాలను అరికట్టడానికి మొదట బోధనల మార్గాన్ని అనుసరిస్తుంది. తరువాత కఠినశిక్షలను విధిస్తుంది. క్షుణ్ణంగా పరిశీలిస్తే ఇస్లాం విధించే కఠిన శిక్షలు అసలు శిక్షలు కావు. అవి సామాజిక రుగ్మతలకు చికిత్స.

**" విశ్వాసులారా! మీరు న్యాయం కోసం గట్టిగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీరు చెప్పే న్యాయం, మీరిచ్చే సాక్ష్యం మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకు నష్టకరంగా పరిణమించినాసరే (న్యాయాన్ని మాత్రం విడనాడవద్దు.)"** అని అంటోంది దివ్యఖుర్ఆన్. అలాగే "తప్పయినా, ఒప్పయినా నా వర్గం, నా దేశం (My community right or wrong)" అనే భావనను ఇస్లాం ఒప్పుకోదు. ఎవరు చేసినా తప్పుతప్పే. ఒప్పు ఒప్పే. తప్పు ఒప్పు కాజాలదు. ఒప్పు తప్పు కాజాలదు. అందుకే న్యాయనిర్ణయం గైకొనేటప్పుడు దురభిమానానికీ, పక్షపాతానికీ, రాగద్వేషాలకు తావీయకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ఉన్నమాటను సూటిగా, నిష్కర్షగా పలకాలి. సత్యాన్ని పలికేటప్పుడు రెండు నాల్కల ధోరణికి, మొహమాటానికి ఆస్కారం ఇవ్వకూడదు. ఆ విషయాన్నే దివ్యఖుర్ఆన్ ఈ విధంగా ప్రకటించింది:

> **"ఓ విశ్వాసులారా! దైవానికి భయపడండి. సత్యాన్ని సూటిగా చెప్పండి. (మీరు ముక్కు సూటిగా పోయినప్పుడు) దేవుడు మీ ఆచరణల్ని సంస్కరించే బాధ్యత తీసుకుంటాడు. మీ తప్పుల్ని మన్నిస్తాడు.."**

## మానవ హక్కులు - 7

అబూ అలీఖ్



# చట్టం దృష్టిలో అందరూ సమానులే

కాబట్టి న్యాయం చేయడానికి కూర్చున్నప్పుడు తన వర్గం వారు- పరాయి వర్గం వారన్న సంకుచిత దృష్టికి తావీయకుండా విశాల దృక్పథంతో తీర్పు యివ్వాలి. తన వర్గం వారి పక్షాన న్యాయం లేదని తెలిసి కూడా దురభిమానం కొద్దీ దాని వైపునకు మొగ్గిపోయిన వాని ఉపమానం , గొయ్యి వైపునకు పరుగెత్తుకుంటూ పోయే ఒంటె తోక పట్టుకున్న వ్యక్తి లాంటిది. ఆ ఒంటె ఆ గొయ్యిలో పడితే ఆ వ్యక్తి కూడా దాంతోపాటే అందులో పడతాడు అని మహాప్రవక్త(స) చెప్పారు.

వాస్తవిక దృష్టితో ఇస్లామీయ చరిత్రను అధ్యయనం చేసినవారు, ముస్లింలు సదా ఈ సూత్రానికి కట్టుబడి ఉన్నారన్న సంగతిని తప్పక అంగీకరిస్తారు. హజ్రత్ అలీ(ర) తృతీయ ధర్మ ఖలీఫాగా ఉన్న కాలంలో ఒక యూదవ్యక్తికి వ్యతిరేకంగా న్యాయస్థానం తలుపుతట్టారు. తన ఆరోపణలకు సాక్షులుగా ఆయన తన కుమారుడగు హజ్రత్ హసన్ (ర) ని, తన దగ్గర ఉన్న బానిసను హాజరుపరచారు. కాని న్యాయమూర్తి ఈ రెండు సాక్ష్యాలను కూడా త్రోసిపుచ్చారు. తండ్రి కోసం కొడుకు ఇచ్చే సాక్ష్యం, యజమాని కోసం సేవకుడు ఇచ్చే సాక్ష్యం స్వీకారయోగ్యం కాజాలదని నిర్ద్వంద్వంగా తేల్చిచెప్పారు. కడకు ఆ కేసులో తీర్పు యూదునికి అనుకూలంగా (ఖలీఫాకు వ్యతిరేకంగా) వచ్చింది. అయితే ఖలీఫాకు బహిరంగంగా కలిగిన పరాభవంలోనే దేవుడు విజయాన్ని పొందుపరచి ఉంచాడని ఎవరికి తెలుసు? న్యాయస్థానంలో జరిగిన నిష్పాక్షిక న్యాయ విచారణకు ముగ్ధుడైన ఆ యూద వ్యక్తి, ఇస్లాం న్యాయం స్వభావం ముందు తల వంచుతూ ముస్లింగా మారిపోయాడు.

ముస్లిం పాలకుల ఈ న్యాయశీలం ఖిలాఫత్ తొలి కాలానికి మాత్రమే పరిమితం కాలేదు. ఖిలాఫత్ వ్యవస్థ అధోగతిలోనున్న రోజుల్లో సయితం వారు న్యాయం విషయంలో ఎంతో నిష్పక్షపాతంగా వ్యవహరించారు! న్యాయం కోరుతూ దర్బారుకు వెళ్ళిన ప్రతి ఒక్కరికీ అక్కడ న్యాయం దొరికేది. ఎందుకంటే వారంతా దైవానికి భయపడి తీర్పులు ఇచ్చేవారు. తాము కూడా ఒకానొక మహారోజున- తీర్పుదినాన - అత్యున్నత న్యాయాధిపతి ఎదుట నిలబడవలసి ఉందన్న భావన వారిని అనుక్షణం అప్రమత్తంగా ఉంచేది. నిజానికి ఇదంతా ఇస్లాం ద్వారా మానవతకు లభించిన కానుకే. ★

హాఫిజ్ ఎస్.ఎమ్ రసూల్

# వుజూ వివరణ



## వుజూ చేయటం ఫర్జ్ (విధి)

వుజూ చేయటం ఫర్జ్ (విధి) అన్న సంగతి ఖుర్‌ఆన్ హదీసుల ద్వారా బోధపడుతోంది. దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు:

**"విశ్వసించిన ప్రజలారా! మీరు నమాజు కొరకు లేచినప్పుడు మీ ముఖాలను, చేతులను మోచేతుల సమేతంగా కడుక్కోండి. తలను చేతులతో స్పృశించండి. కాళ్ళను చీలమండల వరకు కడుక్కోండి."**

(ఖుర్‌ఆన్ 5:6)

## వుజూ లేకపోతే నమాజ్ అంగీకరించబడదు

హజ్రత్ అబూ హురైరా(ర) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: మీలో ఎవరి వుజూ అయినా భంగమయితే (లేదా అసలు వుజూ లేకపోతే) అతను సరిక్రొత్తగా వుజూ చేసుకోనంతవరకు దేవుడు అతని నమాజును స్వీకరించడు.

(బుఖారీ-ముస్లిం)

## వుజూ విశిష్టత

హజ్రత్ అబ్దుల్లాహ్ సనాబజీ(ర) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ప్రబోధించారు: దాసుడు వుజూ చేస్తూ పుక్కిలించి ఊసినప్పుడు అతని నోట్లోని పాపాలన్నీ రాలి పడతాయి. ముక్కు చీదగానే ముక్కులోని పాపాలన్నీ దూరమయిపోతాయి. మొహం కడుక్కునప్పుడు మొహం మీది పాపాలన్నీ తొలగిపోతాయి. తర్వాత అతను తన చేతుల్ని కడుక్కున్నప్పుడు అతని చేతుల నుండి పాపాలు తొలగిపోతాయి. ఆఖరికి చేతి గోళ్ళ క్రింద నుండి కూడా పాపాలు రాలి పడతాయి. తలను స్పృశించినపుడు తల నుండి పాపాలు తొలగిపోతాయి. ఆ సమయంలో అతని చెవుల నుండి కూడా పాపాలు రాలిపోతాయి. తర్వాత కాళ్ళ పాపాలు తొలగిపోతాయి. కాళ్ళ గోళ్ళ క్రింద నుండి కూడా పాపాలు దూరమవుతాయి.

ఆ తర్వాత దాసుడు మస్జిద్‌కు వెళ్ళి, నమాజ్ చేసుకుంటే అది (అతని పరలోకపు అంతస్తులు పెరగటానికి) ఇంకా ఎక్కువ దోహదకారి అవుతుంది. (ముఅత్తా, నసాయి, ఇబ్నెమాజా)

## పళ్ళు తోముకోవటం(మిస్వాక్)

1. ప్రతి నమాజుకు ముందు మిస్వాక్ చేయటం ఉత్తమం.
2. నిద్ర లేచినప్పుడు, వుజూ చేసుకునే ముందు మిస్వాక్‌తో నోరు శుభ్రం చేసుకోవాలి. (ముస్లిం)
3. మిస్వాక్ (పసుదోము) పుల్లతో నాలుకను కూడా తోముకొని శుభ్రం చేసుకోవాలి. (ముస్లిం)

## వుజూ చేసుకునే మస్నూన్ పద్ధతి

వుజూ లేకుండా నమాజ్ నెరవేరదు.

**1.** వుజూ ప్రారంభించే ముందు "బిస్మిల్లాహ్" అని పఠించాలి. (బుఖారీ)

**2.** చేతుల్ని మణికట్లవరకు మూడుసార్లు కడుక్కోవాలి. (అబూదావూద్)

**3.** మూడుసార్లు నీటితో పుక్కిలించాలి. (తిర్మిజీ)

**4.** మూడు సార్లు ముక్కులోనికి నీరు ఎక్కించుకొని చీదాలి. (బుఖారీ-ముస్లిం, అబూదావూద్)

**5.** రెండు చేతులతోనూ మూడుసార్లు మొహం కడుక్కోవాలి. (బుఖారీ)

ఒక దోసిలి నీళ్ళను గడ్డం క్రింద పోనిచ్చి చేతి వ్రేళ్ళతో గడ్డాన్ని దువ్వాలి (ఖిలాల్ చేయాలి) (అబూ దావూద్)

**6.** కుడి చేతిని మోచేయి సమేతంగా మూడుసార్లు కడగాలి. (బుఖారీ-ముస్లిం)

**7.** తర్వాత ఎడమచేతిని కూడా మోచేయి సమేతంగా మూడుసార్లు కడగాలి. (బుఖారీ-ముస్లిం)

**8.** చేతి వ్రేళ్ళ మధ్య ఖిలాల్ (దువ్వటం) చేయాలి. ( అబూ దావూద్)

**9.** తలను ముందు నుండి రెండు చేతుల్తో స్పర్శిస్తూ చేతుల్ని మెడవరకు తీసుకెళ్ళాలి. అక్కణ్ణుంచి చేతుల్ని తిరిగి మొదలుపెట్టిన దగ్గరికి తీసుకొని రావాలి. ఆ విధంగా చేస్తే ఒకసారి మసహ్ చేసినట్లవుతుంది. (బుఖారీ-ముస్లిం)

**10.** రెండు చెవులనూ లోపలినుంచి, బయటి నుంచి ఒకసారి స్పర్శించాలి. (అహ్మద్, అబుదావూద్)

**11.** కుడికాలు చీలమండ వరకు మూడుసార్లు కడగాలి. (బుఖారీ-ముస్లిం)

**12.** తర్వాత ఎడమ కాలు కూడా చీలమండ వరకు మూడుసార్లు కడగాలి. (బుఖారీ-ముస్లిం)

**13.** కాలి వ్రేళ్ళ మధ్యన ఖిలాల్ చేయాలి. (అబూదావూద్, తిర్మిజీ)




- **ఇస్లాం స్వీకరించిన ముస్అబ్ బిన్ ఉమైర్(ర) ను ఆయన తల్లి ఏం చేసింది ?**

జ: ఇస్లాం స్వీకరించారని తెలిసిన ఆయన తల్లి కుమారునికి అన్నం పెట్టకుండా ఇంటి నుండి గెంటేసింది.

- **ఇస్లాం స్వీకరించిన హజ్రత్ బిలాల్(ర) ఎలాంటి కష్టాలు ఎదుర్కొన్నారు?**

జ: బిలాల్(ర) ఉమయ్యా బిన్ ఖల్ఫ్ బానిస. ఉమయ్యా ఆయన మెడలో త్రాడువేసి మక్కా కొండలమధ్య ఈడుస్తూ తిరగండని అల్లరి మూకలకు అప్పగించాడు. మండే ఎడారి ఇసుకపై పడవేసి బరువైన బండను రొమ్ముపై పెట్టాడు. ఇస్లాంను త్యజించమనీ, లేకపోతే ఇలాగే చావవలసి ఉంటుందనీ వార్నింగ్ ఇచ్చాడు. అయినా హజ్రత్ బిలాల్ (రజి) లొంగలేదు.

- **అమ్మార్ మరియు ఆయన తల్లిదండ్రులు (ర) ఏ విధంగా వేధించబడ్డారు?**

జ: అమ్మార్ మరియు ఆయన తల్లిదండ్రుల్ని ఎడారి వైపునకు తీసుకెళ్ళి మిట్ట మధ్యాహ్నం ఇసుకనేల మీద పడేసి కొరడాలతో ఒళ్ళు హూనం చేసారు. ఎన్నోవిధాల హింసించారు. దైవప్రవక్త(స) వారి బాధను చూసి "ఓ యాసిర్ కుటుంబీకులారా! ఓర్పు వహించండి. నిశ్చయంగా మీ నివాసం స్వర్గం" అని ఓదార్చారు.

- **యాసిర్(ర) ఎలా పరమపదించారు?**

జ: దుర్మార్గులు పెట్టే బాధలను సహించలేక యాసిర్(ర) మరణించారు.

- **సుమయ్యా(ర) ఎలా మరణించారు?**

జ: అబూజహల్ ఈటెను సుమయ్యా(ర) పై విసిరాడు. ఆ దెబ్బకు ఆమె నేలకొరిగారు. ఇస్లాంలో వీరమరణం (షహాదత్) పొందిన తొలి మహిళా మూర్తి ఆమె.

- **యాసిర్(ర) కుమారుడు అమ్మార్(ర) కూడా బాధలకు గురయ్యారా??**

జ: అవును, ఆయన్ను కూడా అవిశ్వాసులు నానా బాధలు పెట్టారు.

## మానవతా మూర్తితో ముఖాముఖి

★ **మీపై శాంతి కురియు గాక!**
★ : మీరూ శాంతి శ్రేయాలతో వర్ధిల్లుగాక!!

★ **ఎవరు మీరు?**
★ : భారతీయుణ్ణి

★ **మీ పేరు?**
★ : సత్య ప్రకాష్

★ **ఏం చదివారు?**
★ : సత్యాన్ని - సమాజాన్ని

★ **మను చరిత్ర చదవలేదా?**
★ : మానవ చరిత్ర చదివాను.

★ **మీ జాతి?** :
★ మానవ జాతి

★ **మీ ఊరు?**
★ :ప్రపంచం

★ **మీ మతం?**
★ : దైవాభిమతం.

★ **మీ కులం- గోత్రం?**
★ : అవసరం అంటారా!?

★ **మీ చిరునామా?**
★ : మానవ మందారాల పూతోట

★ **మీ ఆశయం?** :
★ లోక కళ్యాణం

★ **మీ ఆయుధం**
★ :సత్యతా కరవాలం.

★ **మీకు ఇష్టమైనది?**
★ : న్యాయం- ధర్మం.

★ **మీ ధ్యేయం?**
★ : జగతిలో శాంతి కొరకు,
కష్టజీవుల ప్రగతి కొరకు
మానవాళిలో మంచి కొరకు
శక్తి మేర కృషి చేయటం.

★ **మీ నేస్తం?**
★ మానవత్వం

★ **నాటి మన దేశం?**
★ సిరులు పొంగిన జీవగడ్డ
ఘరులు పారిన జన్మభూమి
పుణ్యం పండించిన పుణ్యభూమి
పాపం నశించిన కర్మభూమి

\- శాంతి ప్రియ

డా.బద్దేరి
(ప్రొద్దుటూరు)

# మీసము లేకున్నా రోషం ఉండాలి



**ప్రశ్న:** అందరూ గడ్డం గొరిగించి మగవానికి గుర్తుగా మీసాలను ప్రదర్శిస్తూ వుంటే ముస్లిములు గడ్డం పెంచి మీసాలు గొరిగేస్తున్నారు?

**జవాబు:** ఎంతమంది పురుష పుంగవులకు మీసాలున్నాయండీ ఈ కాలంలో? ఋషులంతా గడ్డాలెందుకు పెంచుకున్నారు? వాల్మీకి మహర్షికి గడ్డం వుండేదిగా! విశ్వకవి రవీంద్రనాథ ఠాగూరు పొడవాటి గడ్డం పెంచలేదా? రామకృష్ణ పరమహంసకు గడ్డం వుండేది. భీష్ముడికి, ధృతరాష్ట్రునికి చెరొక గడ్డం వుండేది. బ్రహ్మర్షి విశ్వామిత్రునికి, అబ్రహాం లింకన్‌కి, ఏసు క్రీస్తు (అలైహిస్సలాం) కు గడ్డం వున్నట్లు మనకు ఋజువులున్నాయి.

మీసాలు ఎంత గుబురుగా వుంటే అంత ప్రమాదముంది. సైన్సు పరంగా ఆలోచిద్దాం:- కడుపు నొప్పితో బాధపడే రోగిని డాక్టరు వెంటనే పడుకో బెట్టి పొట్ట చింపడు. ముందుగా కాటు పెట్టాల్సిన స్థానం చుట్టు పట్ల క్షవరం చేయిస్తాడు. ఎందుకో తెలుసా? మీకే అర్థమవుతుంది కాసేపటికి. ఆ తర్వాత శుభ్రమైన నీళ్ళతో ఆ ప్రాంతమంతా కడిగేస్తారు. అటు పిమ్మట డిటర్‌జంటు లోషన్‌తో శుభ్రపరుస్తారు. స్పిరిట్ పూస్తారు. కంటి ఆపరేషన్‌లో కూడా కంటి చుట్టూ ఉన్న కనురెప్పల వెంట్రుకలను కత్తిరిస్తారు. కారణమేమో తెలుసా?... బ్యాక్టీరియా వెంట్రుకలను ఆశ్రయించి వుంటుంది. అందులో కొన్ని సూక్ష్మజీవులు సబ్బు నీళ్ళకు, డిటర్‌జంటు లోషన్, స్పిరిటుకు కూడా చావవు. వాటిలో కొన్ని స్పోర్స్ (spores) గా రూపాంతరం చెందుతాయి. ఆ స్పోర్స్ 40 సెంటీగ్రేడు ఉష్ణంగానీ, మైనస్ 4 శీతలం ఉంటేగానీ చావవు. అవి గనక శరీర కణజాలంలోనికి ప్రవేశిస్తే తమ కవచాలను, లేదా కుబుసాలను వదిలేసి కొన్ని బైనరీ ఫిషన్ (Binary Fission) (ద్వివిధావిచ్ఛితి) లేక మరికొన్ని మల్టిపుల్ ఫిషన్ (Multiple fission) (బహుదా విచ్ఛితి) ద్వారా ప్రత్యుత్పత్తి చెంది, కొత్తరోగాలకు కారణభూతం అవుతాయి.

అట్టి సూక్ష్మజీవులు లేక స్పోర్స్‌ను అంటిపెట్టుకొని వుండగలిగే వాటి స్థావరాలు అయిన ఆ వెంట్రుకలే గనక లేకుండా ఉంటేనో...? కనుక ఆపరేషన్ చేశాక వెంట్రుకలు లేనందువల్ల తమ స్థావరాలను కోల్పోయిన ఆ బ్యాక్టీరియా (Bacteria) గానీ, వైరస్ (Virus) గానీ మనిషికి హాని కలిగించలేవు.

మనుజుడికి ఎంత పెద్ద మీసాలుంటే అంత ఎక్కువగా తిని తాగే పదార్థాలను మీసాల వెంట్రుకలతో వడపోత పోయించి అంత క్రితమే ఆ వెంట్రుకలను ఆశ్రయించి వున్న సూక్ష్మజీవులు నోట్లోకి ఏ టికెట్టు అవసరం లేకుండానే అవలీలగా పొట్టలోకి ప్రవేశిస్తాయి. ఒక మిత్రుని మీసాలపై ఈగలు వాల్తుండటం నేను గమనించాను. అంత క్రితం అతడు మజ్జిగ త్రాగాడు. మజ్జిగ తాలూకు అవశేషాలు ఆ మీసాలకు అంటి పెట్టుకొని వుంటాయి. మీగడ Bacteria కు విందు భోజనం కదా! మరి వాటి ప్రత్యుత్పత్తికి మంచి నివాసస్థానం. అలా అభివృద్ధి చెందిన ఆ బ్యాక్టీరియా ఆ తర్వాత అతను తీసుకుకోబోయే ఆహార పానీయాలతో పాటు ఏ చెక్‌పోస్టు అడ్డులేకుండా వుండటంవల్ల ఉదర ప్రవేశం చేస్తాయి. ప్రత్యేకించి మామిడి పండును తిన్న బుర్ర మీసాల రాయుడు తన ముఖాన్ని అద్దంలో తానే చూచుకుంటే తన్ను తాను పోల్చుకోలేడేమో అనిపిస్తుంది. అయినా... ఆ మాటకొస్తే 'రొయ్యకు లేవూ తెగబారెడు మీసాలు!' కాబట్టి మగ మహారాజు ఠీవిని ప్రదర్శించటానికి గడ్డాన్ని వుంచి; నష్టం కలిగించే మీసాలను తీసేస్తే సూక్ష్మజీవ శత్రుదాడి నుండి ప్రతి పురుషుడూ తనను రక్షించుకోవచ్చు. అయినా మీసాలను పూర్తిగా గొరిగించమని ఇస్లాం చెప్పటం లేదే!?

మరికొన్ని ప్రశ్నలకు సమాధానం వచ్చే సంచికలో..

తాహెరా బేగం

# హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) -5

సాధారణంగా ప్రతి భర్తా తన భార్యకు ఏదన్నా కానుక ఇవ్వాలని కోరుకుంటాడు. అలాగే అలీ(ర) కూడా భార్యను సంతోషపరచే యత్నాలు చేసేవారు. ఒక సారి యుద్ధఫలాల్లో వాటాగా ఆయనకు ఒక బంగారు హారం లభించింది. దాన్ని తన భార్యకు కానుకగా ఇచ్చారు. ప్రవక్త(స) కు ఈ విషయం తెలియగానే **హజ్రత్ ఫాతిమా (ర.అన్హా)** ను పిలిపించి, 'ఓ ఫాతిమా! ప్రజల నోట దైవప్రవక్త కూతురు అగ్ని హారం ధరిస్తుందనిపించుకోవాలనుందా?' అని అడిగారు. ఈ మాటలు విన్న వినయ విధేయతలు గల కూతురు వెంటనే ఆ హారాన్ని అమ్మి ఒక బానిసను కొని విడుదల చేశారు.

ప్రవక్త(స) ఏదైనా యుద్ధం నుండి వచ్చినప్పుడు అందరూ ఆనందంతో చక్కగా ముస్తాబయి ఆహ్వానం పలికేవారు. అలాగే ఒకసారి ప్రవక్త(స) ఒక యుద్ధం నుండి తిరిగిరాగా **హజ్రత్ ఫాతిమా (ర.అన్హా)** కూడా ఇల్లు సర్ది, గుమ్మానికి తెర వ్రేలాడదీసి పిల్లలకు దుస్తులు, వెండి కంకణాలు తొడిగించి ప్రవక్త రాకకై నిరీక్షించసాగారు. ఈ ఐశ్వర్యాలు చూసిన ప్రవక్త(స) కూతురింట్లోకి ప్రవేశించక వెనుక తిరిగి వెళ్ళిపోయారు. **హజ్రత్ ఫాతిమా (ర.అన్హా)** కు విషయం వెంటనే అర్థమై పరదాలు చించేశారు, పిల్లల చేతి కంకణాలు తీసేసారు. వారిద్దరూ ఏడుస్తూ తాతయ్య వద్దకు వెళ్ళి తల్లి నిర్వాహకాన్ని తెలియపరచారు. అంతా విన్న ప్రవక్త(స) "మీరు నా ఇంటి సదస్యులు, నా కుటుంబీకులు. మీరిలా మట్టినాణాలతో మాసిపోవడం నాకిష్టం లేదు" అన్నారు. తరువాత అలీ(ర) కు ఏనుగు దంతాల హారం, పిల్లలకై కంకణాలు కొని తీసుకురమ్మని పురమాయించారు.

సామాన్యంగా కూతురు వివాహం తరువాత తల్లిదండ్రులు వారి జీవితంలో జోక్యం చేసుకోరు. కాని ప్రవక్త(స) తమ కూతురి శిక్షణ విషయంలో ఎప్పుడూ అజాగ్రత్తగా ఉండలేదు. వారి లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తి చూపుతూ, వారిని ఉత్తీర్ణులుగా మార్చే ఏ అవకాశాన్ని వదిలేవారు కాదు. తండ్రిచ్చే సూచనలను గ్రహించడమే కూతురి ధ్యేయం కూడా .

## భార్యాభర్తల సంబంధం:

**హజ్రత్ ఫాతిమా (ర.అన్హా)** వివాహమైనప్పుడు ఆమె వయస్సు 16 సంవత్సరాలు, అనుభవంలేని పిల్ల. హజ్రత్ అలీ(ర) మాత్రం ప్రవక్త సాంగత్యంలో ఉత్తమ శిక్షణ పొందారు. కాని నిరుపేదగా జీవితాన్ని గడిపారు. ప్రవక్త(స)కు అలీ(ర) పై పూర్తి నమ్మకం. తాము తీర్చిదిద్దిన రూపంలో జీవితం కొనసాగిస్తారన్న ధీమా కూడా. కాని తమ కూతురు అమాయకురాలని తెలుసు కనుక అప్పుడప్పుడు వారిలోనున్న లోపాలను చూసి పరలోకాపేక్షకుడైన తండ్రిగా సలహాల ద్వారా సరిదిద్దేవారు.

పాత్రలున్నచోట శబ్దం సహజమే. భార్యాభర్తలున్న చోట చిరు కోపాలు, చిటపటలు సహజమే. అలాగే అలీ- **హజ్రత్ ఫాతిమా (ర.అన్హా)** మధ్య కూడా అప్పుడప్పుడు చిరు కలతలు జరిగేవి. అలాంటి సందర్భాల్లో వారిరువురూ ప్రవక్తను సంప్రదించేవారు.

ఒకసారి **హజ్రత్ ఫాతిమా (ర.అన్హా)** ఏదో మాటపై భర్త మనసు నొప్పించారు. అది తెలుసుకున్న ప్రవక్త వెంటనే వారి వద్దకెళ్ళి వారిలో చేరిన ఆ కలతల్ని దూరంచేసి, సర్దుబాటు చేశారు. సంతోషంగా **"నాకు అత్యంత ప్రియులైన వారిద్దరి మధ్య సయోధ్య కుదిర్చాన"**ని చెప్పారు.

మరోసారి హజ్రత్ అలీ(ర) కు **హజ్రత్ ఫాతిమా (ర.అన్హా)** గారి ఏదో వ్యవహారం నచ్చలేదు, ఆమె ముందే తన అయిష్టాన్ని వ్యక్తపరచారు. దానికి **హజ్రత్ ఫాతిమా (ర.అన్హా)** గారి ఆత్మాభిమానం గాయ పడింది. సహించలేక ప్రవక్త(స) వద్దకు వెళ్ళి ఫిర్యాదు చేశారు. అలీ(ర) కూడా ఆమె వెనకే వెళ్ళారు. ప్రవక్త(స) గారు **హజ్రత్ ఫాతిమా (ర.అన్హా)** తో ఇలా అన్నారు: **"ఎంతమంచి భర్త కాకపోతే తన భార్య వెనకే నిశ్శబ్దంగా వస్తాడు?"** అన్నారు. ప్రవక్త(స) గారి మాటలకు వారిరువురూ ప్రభావితులైనారు.

**హజ్రత్ ఫాతిమా (ర.అన్హా)** జీవితాంతం నోటికి తాళం బిగించుకున్నారు. అలీ(ర) తమ నిర్ణయాన్ని ఇలా తెలియపరచారు: **"ఈనాటినుండి ఇంకెప్పుడూ నీకు ఇష్టంలేని పని చేయను, అల్లాహ్‌యే అన్ని ప్రశంసలకు అర్హుడు."**

ఇద్దరు వ్యక్తులు జీవితాంతం దారిద్ర్యంతో రాజీపడిపోయి సంతృప్తిగా గడపడం మామూలు విషయం కాదు. **హజ్రత్ ఫాతిమా (ర.అన్హా)** ధార్మికంగా, నైతికంగా ఎంత ఎత్తుకు ఎదిగారంటే ప్రవక్త ముహమ్మద్(స) ఆమె ఘనతను ఒప్పుకోక తప్పలేదు. ప్రవక్త గారు కూతురిపై ప్రేమతో కాక వారి ఉత్తమమైన నడవడికను చూసి పొగిడారు. ప్రవక్త గారి జీవిత చరిత్ర చదివిన ప్రతి వ్యక్తికీ, ప్రవక్త తమ కుటుంబీకులనుసమావేశ పరచి లెక్కల ఘడియ గురించి హెచ్చరించిన ఆ హెచ్చరిక గుర్తుండాలి.

వారు తమ చిన్నాన్న అబ్బాస్ (ర), అత్త సఫియ్యా(ర), కూతురు **హజ్రత్ ఫాతిమా (ర.అన్హా)**లను సంబోధిస్తూ హెచ్చరించారు. ముఖ్యంగా కూతురునుద్దేశించి, **"ఫాతిమా! ప్రవక్త కూతురునని మిడిసిపడకు. పరలోకంలో లెక్కాచారం జరిగేటప్పుడు నేను నిన్ను ఏ విధంగానూ ఆదుకోలేను. జాగ్రత్త!"** అన్నారు.

# 14వ హజ్జ్ యాత్ర

ఇస్లాం ప్రెజెంటేషన్ కమిటి ( IPC ) ఆధ్వర్యంలో ఈ ఏడాది 130 మంది న్యూ ముస్లిం సోదర సోదరీమణులు 27-11-08వ తేదీ గురువారం నాడు హజ్జ్ యాత్రకు బయలుదేరారు. వారిలో ఆంధ్ర రాష్ట్రానికి చెందిన వారు 40 మంది ఉన్నారు. IPC దాయీ షేఖ్ నజీబుద్దీన్ ఖాన్, దాయియా శ్రీమతి రాజియా షేఖ్ తెలుగు బృందానికి అధ్యాపకులుగా ఉంటారు. IPC సారథ్యంలో ఇది 14 వ హజ్జ్ యాత్ర. డిశంబరు 11 వ తేదీన వీరంతా హజ్జ్ చేసుకుని తిరిగి వచ్చారు. కారుణ్య ప్రభువు ఈ సన్మార్గగాముల హజ్జ్‌ను ఆమోదించాలని, వారి విశ్వాసాన్ని అధికం చేయాలని నెలవంక సిబ్బంది మనస్ఫూర్తిగా ప్రార్థిస్తోంది.





# IPC ఖైతాన్ తెలుగు సోదరుల విహార యాత్ర





14-11-08 శుక్రవారం నాడు 20 మంది తెలుగు న్యూ ముస్లింలు IPC ప్రీచర్ ముజాహిద్ ఖాన్ ఉమ్రీ ఆధ్వర్యంలో విహారయాత్రకు బయలుదేరారు. సాయంత్రం 3 గంటలకు చేరి అక్కడ కబడ్డీ, హ్యాండ్ బాల్ మొదలగు ఆటలలో అందరూ పాల్గొన్నారు. మగ్రిబ్ నమాజ్ తరువాత "స్వర్గమే మన లక్ష్యం" అనే అంశంపై ముజాహిద్ ఖాన్ ఉమ్రీ గారు ప్రసంగించారు.

KFC స్పెషల్ డిష్ సేవించి ఇషా నమాజ్ IPC ఖైతాన్ బ్రాంచ్‌లో చేశారు.

# మీ ముద్దు బిడ్డలను

## ముక్కు పచ్చలారక ముందే మలచుకోండి







పిల్లల్లో సహజంగా ఉన్న తెలివితేటలను నిర్లక్ష్యం చేయకుండా, వాటిని ఉపయోగకరమైన త్రోవలో ప్రోత్సహించాలని జమాఅతె ఇస్లామీ హింద్ సహాయ కార్యదర్శి జనాబ్ అబ్దుల్ అజీజ్ పిలుపు ఇచ్చారు. 'సమ్మర్ ఇస్లామిక్ క్లాసెస్' లో పాల్గొన్న బాలబాలికలకు యోగ్యతా పత్రాలను ప్రదానం చేయటానికి 14-11-2008 తేదీన మదర్సా అల్-నజాత్ ఆడిటోరియంలో ఇండియన్ ముస్లిం అసోసియేషన్ **(IMA)** నిర్వహించిన ఒక బ్రహ్మాండమైన ఉత్సవ సభనుద్దేశించి అబ్దుల్ అజీజ్ ప్రసంగించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకై పసితనం నుంచే సుదీర్ఘ ప్రణాళికను రూపొందించి, తదనుగుణంగా అమలుపరిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఆయన సూచించారు.

ఈ సందర్భంగా ట్రైనింగ్ కాంప్ టీచర్లు, పేరెంట్స్ తరఫు ప్రతి నిధులు కూడా ప్రసంగించారు. **IPC** తరఫున షేఖ్ మాజిద్ షత్తి అతిథిగా విచ్చేశారు. గత 16 ఏండ్లుగా **IMA** సంస్థ ఇండియన్ కమ్యూనిటీ కొరకు వేసవి శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసి, ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్థాయి బాలబాలికలకు ధార్మిక శిక్షణ నిస్తోంది. 2008లో బాలలు రికార్డు స్థాయిలో పాల్గొన్నారు.

## IPC సిటీ తెలుగు సోదరుల విహార యాత్ర





ఉమ్మె ఫాతిమా

# దేవుడు ఒక్కడే అని అంటే సరిపోతుందా?

దేవుడు ఒక్కడు.. అంటే.. ఒక్కడే కదా అంటున్నారా? కరక్టే మరి అది ఎలాగ అన్నదే కొందరికి తెలియని విషయం


ఈ లోకంలో ఎన్నో జాతులు నివసిస్తుండగా అందరికీ దేవుని గురించిన జ్ఞానం కాస్తో కూస్తో వుందని చెప్పవచ్చు. కాని అందులో దేవునికి సంబంధించిన నిజం ఎంతవరకు ఉంది అనే విషయాన్ని ఆలోచించే వాళ్ళు తక్కువనే చెప్పవచ్చు. ఎందుకంటే బహుశా వారివద్ద సమయం లేదు. రెండవది ఆసక్తి లేదు. రెండూ తప్పైన ధోరణులే!.

ఈనాడు సైన్సు ఎంతో అభివృద్ధి చెంది, భూమ్యాకాశాలలో దాగివున్న రహస్యాలను సైతం శోధించే మహత్తర ఖగోళ జ్ఞానం ఉండికూడ నిజ దేవుని గురించి తెలుసుకోవడంలో చాలా వెనకబడివున్నాము.

దేవుని గురించి పలువురి యొద్ద చర్చించినపుడు దేవుడొక్కడే అన్నప్పుడు ఇంచుమించు అందరి యొద్దనుండి దొరికే సమాధానం "అవును కదా. దేవుడొక్కడే" అంటారు. ఉదాహరణకు:- మూడు జాతుల గురించి తెలుసుకుందాం- హిందువులు, క్రైస్తవులు, ముస్లిములు.

హిందువులు కొందరు పెక్కు దేవుళ్ళను పూజిస్తారు. వైష్ణవులు "విష్ణువు" ఒక్కడే ముఖ్యమైన దేవుడు అన్నట్టుగా, శైవులు "శివుడు ఒక్కడే" ముఖ్యమైన దేవుడన్నట్టుగా పూజిస్తుంటారు.

క్రైస్తవులను అడిగినపుడు, వీళ్ళునూ "దేవుడొక్కడే" అంటారు. కొందరు అతనే జీసస్ అనంటారు.



**(1)** మరికొందరు త్రిత్వంలో ఏకత్వ ముందంటారు. అంటే (దేవుడు+జీసస్+పరిశుద్ధాత్మ) ముగ్గురు చేరి చమత్కారమైన సమాధానంగా "ఒక్కడు" అంటారు.

మరి ముస్లిములను అడిగినప్పుడు దేవుడు ఒక్కడే, అతనే అల్లాహ్ అనంటారు. దేవుని దయవలన ఏ ముస్లిమును అల్లాహ్ తప్ప వేరొకరిని దేవుడనడు. కాని దురదృష్టవశాత్తు, వీళ్ళలోనూ తప్పటడుగులు వేసేవారున్నారు! అది ఎలాగ అని ఆశ్చర్యపోతున్నారా?

విచారించదగ్గ విషయం ఏమిటంటే, కొందరు ముస్లిములు ఖురానులో చాలా స్పష్టమైన వాక్యాలున్నప్పటికీ సమాధులను సందర్శించి వాటి ప్రదక్షిణ చేస్తున్నారు. బూటకపు గురువులను ఆశ్రయిస్తున్నారు.

> ఇలా ప్రతివారూ మాకు ఒక్కడు, మాకూ ఒక్కడే అంటే, మరి ఇన్ని ఒక్కళ్ళు చేరి మిక్కిళ్ళు కాలేదాండీ? ఒక్కళ్ళు= మిక్కిళ్ళు అవుతుందా? ముమ్మాటికి కాదు.

ఇలా ఇంచుమించు అన్ని వర్గాల వారు ఫలానా దేవుడు మాకు, ఆ ఫలానా దేవుడు వాళ్ళకు అనుకొంటున్నారు. మరి ఆ ఫలానా దేవుడైనా నిజమైన దేవుడేనా అని తెలుసుకోలేని అమాయక బ్రతుకు బ్రతుకుతున్నాం.

ఇంకొంత మంది పెద్ద మనుషులు అందరి "దేవుళ్ళు ఒక్కటే" అని, గొప్పగా చెప్పామనుకొంటారేమో! అది పొరపాటు.

లోకంలో కొంతమంది మట్టి బొమ్మలను, మరికొందరు సామాన్య మనిషిని సైతం దేవునిగా తలచుకొని, మరోపక్క నిజమైన దేవుని కూడ పూజించేవాళ్ళుండగా అన్ని దేవుళ్ళు ఒక్కటే అన్నది నిజం ఎలా కాగలదు?

**(2)** ఇక ముస్లిములు ఎక్కడ పప్పులో కాలువేస్తున్నారంటారా? ఉదా: మన దేశం **(India)** లో ఎన్నో గుళ్ళు గోపురాలున్నాయి. ముస్లిములును, హిందువులును కలిసి వున్న దేశమిది. ఎక్కడైనా ఏ పూజనో, బ్రహ్మోత్సవాలో జరిగినపుడు, ఎన్నో వేలమంది దర్శకులు కానవస్తారు.

మరి ఇలాంటి సందర్భాలలో కొంతమంది ముస్లిములు తమ బంధు మిత్రులతోనో, సంబంధీకులతోనో సంభాషించినపుడు "వాళ్ళ ఫలానా దేవుడైన **"XYZ"** అక్కడికి వెళ్ళి మొక్కుబడి చేసుకొంటే కష్టాలు తీరుతాయట అనో, లేక జన సమూహాన్ని పొగుడ్తూ; "వాళ్ళ దేవుడిపైన వాళ్ళకు అంత నమ్మకముంది" అనో అన్నారనుకోండి-

ఈ విధంగా సంభాషించినపుడు స్పష్టమయ్యే విషయం ఏమిటంటే అల్లాహ్ ముస్లిములకు మాత్రమే ప్రభువు, మిగిలిన వాళ్ళకు వాళ్ళ, వాళ్ళ దేవుడున్నాడని నమ్ముతున్నట్టు లెక్క. అల్లాహ్ విశ్వప్రభువు అంటే అందరికీ ప్రభువని ఖుర్ఆన్‌లో స్పష్టముగా వున్నా కూడా కొందరు తెలియని అమాయక ముస్లిములు ప్రపంచపు కొన్ని మూలల్లో వున్నారు. అల్లాహ్ ఈ కొందర్ని మరియు మనందర్ని కూడా సరయిన రీతిలో అర్థం చేసుకొనే జ్ఞానాన్ని త్వరలో ఇవ్వాలి. (ఆమీన్)

ఇలాంటి నమ్మకమే ఇతర జాతుల వారిలోనూ ప్రబలి వుంది. దేవుడు వీళ్ళను కూడ సరైన మార్గంలో నడపాలి. (ఆమీన్)

# ఓ బాటసారీ! నీ గమ్యం మరువకోయి

- ముహమ్మద్ (జి. ఓబుల్ రెడ్డి)

**ఓ బాటసారి!**

నీ జీవిత పయనమెటు? కంటికి కునుకు లేకుండ, కాలికి నిలకడ లేకుండ గమ్యం ఏదో తెలియక ఇహలోక జీవితం శాశ్వతం అని మోసపోయి, మరణాన్ని పరలోకాన్ని మరచిపోయి చివరికి చేరవలసిన స్థానం (శాశ్వత స్వర్గ మార్గం) తెలియక దేవుని మరచి, సత్యాన్ని ధర్మాన్ని మంటగలిపి, పేరాశతో దౌర్జన్యాలకు దోపిడీలకు పాల్పడి, ప్రజల వద్ద దోచుకున్న సొమ్ముతో, వడ్డీ సొమ్ముతో ధనాన్ని కూడబెట్టి, బంగ్లాలు కార్లు మేడలు మిద్దెలు శాశ్వతమనుకొని, కంటికి పొరలు కమ్మి కామాంధునిలా వ్యభిచారానికి పాల్పడి, భూలోకమే స్వర్గం అని భ్రమపడి గర్వంతో నాయంతటి వారు ఎవ్వరూ లేరు అని ప్రగల్భాలు పలుకుతూ ఈ భూమి మీద విర్రవిగు తున్నావు.

అన్యాయానికి పాల్పడి, పాపం-పుణ్యం సమానమని మోసపోతున్నావు. కాల చక్రం తిరుగుతుంది. సూర్యుడు ఉదయిస్తున్నాడు. అస్తమిస్తున్నాడు. రోజులు, వారాలు; నెలలు సంవత్సరాలు కాలచక్రంలో గడచిపోతున్నాయి. నీ ప్రయాణం బహుదూరం అని మోసపోతున్నావు, ఏ క్షణంలో నీపై మృత్యువు విరుచుకు పడుతుందో ఆ ఏకేశ్వరుడైన అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. ఆ విశ్వప్రభువు నుంచి నీ మరణాన్ని ఆపగలిగే శక్తి ఎవ్వరికీలేదు. మార్గం తెలియక మోసపోతున్నావు. తలవెంట్రుకలు తెల్లబడి రాలిపోతున్నాయి. వృద్ధాప్యం మొదలయింది. కనురెప్పలు మూత పడనున్నాయి. శ్వాస ఆగిపోనుంది ఇహలోకప్రపంచం నీకు స్వస్తి చెప్పనుంది. పరలోకం చేరుకోనున్నావు. దేవుని దగ్గర ఇహలోక జీవితం గురించి నువ్వు చేసిన దగా, మోసం, దోపిడీలు, హత్యల గురించి జగం ఎరిగిన విశ్వప్రభువు దగ్గర నువ్వు హాజరుపడవలసి ఉంది. ఏమి సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నావు? నువ్వు చేసిన అన్యాయం అరాచకాల గురించి నీ అవయవాలు ప్రతి ఒకటి పరలోకంలో దేవుని దగ్గర సాక్ష్యం ఇచ్చే దానికి ఏ మాత్రం వెనుకంజ వెయ్యవు. ఆలోచించుకో! మరణఘడియలు సమీపించబోతున్నాయి అనిపిస్తుంది కదూ! ముసలి తనం వచ్చేసింది కదూ! మృత్యువు సమీపించబోతుందని భయమేస్తుంది కదూ! చావు గుర్తుకు వచ్చింది కదూ! చనిపోతానని భయమేస్తుంది కదూ! ఆలుబిడ్డలు ఆస్తిపాస్తులు నీ సొంతం కాదని తెలిసిపోయింది కదూ! కట్టుకున్న బట్ట కూడ నీ వెంబడి తీసుకెళ్ళలేనని తెలిసిపోయింది కదూ!

సృష్టికర్త ఉన్నాడని పరలోకం ఉందని దేవుని దగ్గర హాజరు కావాలని మరువకు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. కన్ను మూత పడకముందే, మృత్యువు కబళించక ముందే దేవునికి క్షమాపణ తెలుపుకో. నువ్వు చేసిన దుర్మార్గం అన్యాయాల గురించి మన్నించమని ఏకేశ్వరుడు అయిన అల్లాహ్‌ను వేడుకో. ఆలుబిడ్డలను, బంధువులను ధర్మంగా జీవించమని, దేవునికి భయపడమని, మరణాన్ని పరలోకాన్ని నమ్మమని ప్రళయదినాన్ని విశ్వసించమని వారికి తెలియ చెయ్యి. నువ్వు మరణించకముందే, నీ కన్ను మూతపడక ముందే **లా ఇలాహ ఇల్లల్లాహ్** అని పలుకు. అల్లాహ్ క్షమించేవాడు మరియు మన్నించేవాడు అని తెలుసుకో.

(కువైట్ సెంట్రల్ జైలు నుండి)







# నెలవంక ఉత్తరాలు

## కువైట్ కబుర్లు



నెలవంక మాస పత్రిక ఛీఫ్ ఎడిటర్ గార్కి అస్సలాము అలైకుమ్. నవంబరు నెలలో ప్రచురితమైన కొత్త శీర్షిక "కువైట్ కబుర్లు" చాలా బాగా ఉంది. 'ఆదరిస్తే అత్యున్నత స్థాయికి, ఆదమరిస్తే అధ్వాన్న స్థితికి" కొత్తగా వచ్చేవారికి ఒక హెచ్చరికలా, కువైట్‌లో ఎన్నో ఏండ్లుగా వుండి ఆదమరచిన వారికి మేలుకొల్పుగా ఉంది. ఈ శీర్షికను రచిస్తున్న ముహమ్మద్ హనీఫ్ గార్కి ధన్యవాదాలు. ఇలాంటి మరెన్నో మంచి రచనలు ఆయన కలం నుండి జాలువారాలని ప్రార్థిస్తున్నాను.

అందాల దీపం, ఆనంద రూపంలా వెలువడుతున్న నెలవంక మాస పత్రిక తొందరలో వారపత్రికగా రావాలని ఆశిస్తూ...

–M. జీలాని బేగ్
(షువైఖ్.బి)

## దీన్ని నా అదృష్టంగా భావిస్తాను



అల్లాహ్ తాలా నన్ను తన (కాబా) గృహానికి హజ్ యాత్ర కోసం పిలుపునిచ్చాడు. దీనికి గాను నేను అల్లాహ్ తాలాకి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. దీన్ని నేను ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. ఈ హజ్ కాగానే నేను కొత్త జీవితాన్ని ప్రారంభించాలి. ఎవరైతే దైవప్రసన్నత కోసం హజ్ చేస్తారో వాళ్ళు అప్పుడే తల్లి కడుపున పుట్టిన శిశువులా పాపరహితుడుగా ఉంటారు.

ఈ నెలవంక ద్వారా నేను ఎన్నో ధార్మిక విషయాలు నేర్చుకున్నాను. నెలవంకను అందంగా అత్యంత రమణీయంగ తీర్చిదిద్దిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. IPC సంస్థవారు ఈ హజ్ యాత్రకై నన్ను ఎంపిక చేసినందుకు వారికి నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

–సులైమాన్ (ఖైతాన్)

## భక్తీ పారవశ్యంతో మనసు పులకించిన వేళ



ఒకప్పుడు అజ్ఞానంతో ఉన్న నాకు దేవుడు ఇస్లాం ద్వారా ఏకేశ్వరోపాసనా మార్గం ప్రసాదించాడు. ఇస్లాం ద్వారా నేను ధన్యుణ్ణి అయినాను. చివరకు ఇస్లాం మూలస్తంభాలలో ఒకటైన హజ్జ్‌ను నెరవేర్చే బంగారు అవకాశం కూడా నాకు అల్లాహ్ కల్పించాడు. ఏకేశ్వరోపాసనకు, త్యాగానికి, విధేయతాభావానికి మరోపేరుగా వెలుగొందిన పితామహుడు ఇబ్రాహీమ్(అ) గారు సంచరించిన పుణ్యప్రదేశానికి వెళుతున్నందుకు, తల్లి హాజిరా గారి అడుగు జాడలలో 'సయీ' చేయబోతున్నందుకు, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) వారు అంతిమ హజ్‌యాత్ర సందర్భంగా ప్రసంగించిన అరఫాత్ మైదానంలో విడిది చేయబోతున్నందుకు నా మనస్సు భక్తీ పారవశ్యంతో ఓలలాడుతున్నది.

– కె. అబ్దుల్లాహ్ (షువైఖ్)

## నా దాహం తీర్చిన నెలవంక


నా పేరు అబ్దుర్రహ్మాన్. నేను గత సంవత్సరం ఇస్లాం స్వీకరించాను. నేను ముస్లింగా మారక మునుపు ఇస్లాం పట్ల ఎన్నో అపోహలు ఉండేవి. ఆ "అల్లాహ్" కృపవల్ల నా దురనుమానాలు దూరమయ్యాయి. IPC ఉపాధ్యాయులు సందేహాలు తీర్చిదిద్దారు. వారి చక్కని ఉపన్యాసాలు, పాఠాలు నా మనస్సులో ఉన్న చెడుని మొత్తం కడిగివేసాయి. ఈ విధంగా నేను నవముస్లింగా పరిశుద్ధ మనస్సుతో జీవిస్తున్నాను.

అడుగలేని ఎన్నో ప్రశ్నలు, నా మదిలో ముద్ర పడిపోయిన మరి కొన్ని అనుమానాలు ఇవి ఎవరు నాకు తీరుస్తారు? అని మధనపడేవాడిని.

ఆ సమయంలో నా దాహం తీర్చింది నా ఈ నెలవంక. దానిలో ఎటువంటి వ్యాసాలు మా ఉపాధ్యాయులు వ్రాసారు అంటే.. అది చదివిన తరువాత ఒక సామాన్యుడు కూడా మంచి వ్యక్తి అవుతాడు.

– అబ్దుర్రహ్మాన్ (కువైట్)

## భాగ్యవంతుణ్ణి



అల్లాహ్ నాకు సన్మార్గం చూపాడు. నెలవంక మాసపత్రిక నా ధర్మ సందేహాలు తీర్చింది. IPC గురువులు నా జీవన రథాన్ని ధర్మపథంలో నడిపించారు. హజ్ యాత్రకు వెళ్ళి, కాబా గృహంలో ప్రార్థన చేయాలని నా మనసు తహతహలాడేది. కాని నాకు అంతటి ఆర్థిక స్థోమత లేదు. అయితే IPC పెద్దల ద్వారా అల్లాహ్ ఈ ఏర్పాటు చేశాడు. నాకు లభించిన ఈ మహాభాగ్యాన్ని తలచుకుని తాదాత్మ్యం చెందుతున్నాను.

–అబ్దుర్రహ్మాన్ బోడపాటి

# వివేచన

మీరు గనక మృదు స్వభావులై ఉంటే జనులు మీ మృదుత్వాన్ని స్వార్థం కొరకు వాడుకోవచ్చు. అయినప్పటికీ మీరు మృదుత్వం, మన్నింపుల వైఖరినే అవలంబించండి.





హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు:

“ఏ వ్యక్తి అయితే నరకం కొరకు నిషేధించబడ్డాడో, ఏ వ్యక్తి మీద అయితే నరకం నిషేధించబడిందో ఆ వ్యక్తి గురించి నేను మీకు తెలుపనా! మృదుస్వభావి, సౌమ్యుడు, కలుపుగోలుగా ఉండేవాడు, పట్టువిడుపుల వైఖరిని అవలంబించేవాడు.”

(అబూ దావూద్, తిర్మిజీ)

# నూతన సంవత్సర శుభాకాంక్షలు !

క్రీ. శ. 2009 హి. శ. 1430

చెట్టాపట్టాల్ పట్టుకుని
దేశస్థులంతా నడవవలెనోయ్
అన్నదమ్ముల వలెను జాతులు,
మతములన్నీ మెలగవలెనోయ్



## చంద్రయాన్

## భారత వైజ్ఞానిక కీర్తికి కలికితురాయి